# తిరుప్పావై గజల్ మాలిక
## (పాశురములతో)



**డా. జంధ్యాల ఉమాదేవి**

# తిరుప్పావై – గజల్ మాలిక

(పాశురములతో)

**డా. ఉమాదేవి జంధ్యాల**
Reader in Telugu,
Jawahar Bharathi Degree College, Kavali

**జె.వి. పబ్లికేషన్స్**
హైదరాబాద్

**Thiruppavai Gazal Malika**
*with Pasuralu*

By
Dr. Umadevi Jandhyala

First Edition: July, 2018

© Author

For Copies & Address :
**Dr. B. Umadevi Jandhyala**
501, BR Residency,
New Shankarnagar Colony,
Near Ashok Nagar, Hyderabad 500050.
Mobile: 9948791572.

Copies: 500

Book Price : Amulyam

Book Publishing Works:
**JV Publications**
jyothivalaboju@gmail.com


Cover Design:
**Ramakrishna Pukkalla**
+91 91107 68546
Andhra Pradesh.

DTP & Type Setting:
**K. Ravi Prabha**, Cell: 96666 08835

*Printed at:*
**Karshak Art Printers,** Vidyanagar, Hyd.44

*for Copies:*
**Jyothivalaboju**
Phone: 80963 10140

& All Major Book Shops



**T.P. RAGHAVACHARI,** M.A., B.Ed.,
Andhrapradesh Govt. Best Teacher Awardee
Retd. Headmaster
Simhahala Devastanam Sanskrit High School
SIMHACHALAM
Ph. 9441080222

సింహాచలం,
తే. 29-5-2018.

# మంగళాశాసనములు

ప్రియసోదరి డా. ఉమాదేవిగారికి,

అభినందనపూర్వక మంగళాశాసనాలు!

తల్లీ! మీరు ఆదరంతో పంపిన మీ 'గోదాసూక్తిమాలిక" ఆమూలాగ్రంగా చూశాను. మళ్ళీ ఒకమారు ఆనందడోలికలలో ఊగులాడేను.

అలనాడు అలవోక విష్ణుచిత్తుని యింట పారాడు రతనాలబొమ్మ గోదమ్మంట!

'అప్ప' చెప్పిన మాట ఆలకించిందంట! చిననాడె వెన్నుణ్ణి పతిగ తలచినదంట!

రంగడంటే గొప్పవలపు కలిగిందంట! తలదాల్చి పూమాల సామికిచ్చిందంట!

ఎదలోని ఊసులతొ పాట పాడిందంట! భువివారికదియెంతొ అమృతాల సిరియంట!

అంతటిదీ ఆండాళ్‌తల్లి వైభవం! పన్నెండుమంది ఆళ్వార్లలో ఈమె ఒక్కతే స్త్రీమూర్తి. వేదాంతదేశికులు చెప్పినట్లు, తండ్రులకు కూడా మధురభక్తి పరవళ్ళకు మేలుబంతియై నిలచింది గోదాగోపిక! ఆంధ్రభోజుని వంటివాణ్ణి కదిలించి 'విష్ణుచిత్తీయం' వ్రాయించింది. మధురభక్తికి, ప్రేమోరస నిష్యందనానికీ వేగుచుక్కయై వెల్సింది.

**అయ్యవారి యింటిలోన అందమైన పూమాలగ**
**తా జనించి శ్రీరంగని వలచెను ఈ బాలిక!**
(తమిళంలో కోద లేక గోద అంటే పుష్పమాలిక అని అర్థం)

**పసితనమ్మునందే చిరుపైట వేయుముందే**
**వెన్నుని తన పతిగా భావించిన వలపు చిలుక!**

ఎదనంత పూగుత్తిగ చేసి నందనందనుని పాదాల చెంత ముడుపు కట్టిన ముద్దరాలు! గోద జనించినది ద్రావిడదేశంలోనే అయినా తెలుగునాటా గోదాదేవి కథకు ఎనలేని ప్రాచుర్యం ఏనాటినుండో ఉంది. మన సంకురేతిరి సంబరాలలోని గొబ్బిపాటలు ఈ గోదాగోపికకు చెందినవే! ఈ గోదాదేవి తమిళంలో వ్రాసిన ప్రబంధాలు రెండే! ఒకటి నాచ్చియార్తిరుమొజి, ఇంకొకటి తిరుప్పావై. ఈ తిరుప్పావై రాసిలో స్వల్పం అయినా వాసిలో మాత్రం అనల్పం! కేవలం 30 పాటల ఈ ప్రబంధానికి దేశంలో లభించిన ఖ్యాతి మాత్రం చాలా ఎక్కువ! ఎందుకంత ప్రాధాన్యం అంటే, ఇది వేదబీజం! ఉపనిషత్సారం! రసఘనమైన ఉత్తమ కావ్యం! అందుకే కవిహృదయం కలవాళ్ళందరికీ తిరుప్పావై అంటే అంత పిచ్చి, అంత వ్యామోహం!

అల్లనాడెప్పుడో ముద్దుపళని సప్తపది అన్న పేరుతో కొన్ని తిరుప్పావు పాశురాల్ని తెలుగు చేసింది, కాని అది అసమగ్రం మాత్రమే కాక, సందేహిత కర్తృకం కూడా! ఇంక ఈ పాశురాలను గేయరూపంలో మలచినవాళ్ళకూ తెలుగునాట కొఱత లేదు. ఎప్పుడో వందేళ్ళ క్రిందటే, హేలాపురి (ఏలూరు) కందాళ సీతమ్మగారు చక్కని జానుతెలుగులో పాటలుగా వెలయించి, స్వరపరచి ప్రచారం చేశారు. ఆధునికులలో అద్భుతంగా రసఘనంగా తెలిగించినవారు శ్రీ దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రిగారు, శ్రీ మాన్మత్తేవి లక్ష్మణయతీంద్రులవారు!

కానీ, సోదరి డా. జంధ్యాల ఉమాదేవి ఇంకో విశిష్టమైన పద్ధతిలో తిరుప్పావు పాటలను తెలుగులోకి తెచ్చారు. ఆదిభట్లవారి కాలంలోనే క్వాచిత్కంగా తెలుగులోకి వచ్చి, దాశరథి, నారాయణరెడ్డిగార్ల కృషితో వేళ్ళూనుకొన్న పారశీక కవితా సంప్రదాయంలోని 'గజల్' ప్రక్రియలో ఉమాదేవిగారు ఈ ముప్పది పాశురాలనూ తెలుగులోకి తెచ్చారు. ప్రతి గీతికనూ "ఓహో!" అనదగ్గట్లు చెక్కారు!

మూలవిధేయంగా, గజల్ సంప్రదాయానికి భంగం కలగకుండా, సంప్రదాయ పడికట్టు మాటలను గుప్పించి చదువరులను గందరగోళానికి గురి చేయకుండా, నాల్గుదశాబ్దాలకాలం వివిధ కళాశాలలలో, విశ్వవిద్యాలయంలో యువతీయువకులకు తెనుగు బోధించిన తన భావవ్యక్తీకరణ సామర్థ్యాన్ని చక్కగా ఉపయోగించుకొని, అలతి అలతి పదాలతో, సామాన్య చదువరులకు కూడా అర్థమయ్యే రీతిలో గోదాదేవి హృదయాన్ని పాఠకజన హృదయంగమంగా ఆవిష్కరించారు సోదరి ఉమాదేవి.


డా. ఉమాదేవిగారు ఈ గజల్స్ వ్రాస్తున్నప్పుడే ఆ పురిటి పిల్లలను చూచే అదృష్టం నాకు కలిగింది. తొలి చదువరిని నేనే! ఇప్పుడు ఆ గజల్స్ అన్నీ ఒక సంపుటంగా వెలువడుతున్నప్పుడు వాటికి ఓ రెండు పరిచయవాక్యాల్ని వ్రాయడం నాకు ఓ గొప్ప అదృష్టం, గౌరవం కూడా!

గోదాదేవే రచించిన, ప్రేమ నిర్వచనాన్ని తెలియపరచే 143 పాటలుగల నాచ్చియార్తిరుమొజి అన్న ప్రబంధాన్ని కూడా డా. ఉమాదేవి ఇలాగే గజల్స్ రూపంలో వెలయించాలని నా ఆశ!

అందుకు తగిన శక్తినీ, ఆరోగ్యాన్నీ, భావశబలతనూ ఆ ఆండాళ్ తల్లి మా సోదరి డా. ఉమాదేవికి అనుగ్రహించాలని మంగళాశాసనాలుచేస్తూ...

భవదీయ సోదరుడు,

**టి.పి.రాఘవాచార్య.**



**శ్రీనివాస భరద్వాజ కిశోర్**
టాలహాసీ, ఫ్లోరిడా, USA
+1 (850) 321-4705
srinikishore@gmail.com

# గానయోగ్యమైన గజల్ మాలిక

'గజల్' అన్న పదం వినగానే – అలంకరింపబడ్డ వేదికపై శాలువా కప్పుకుని హార్మోనియమ్ వాయించుకుంటూ, తబలాతోబాటు ఇంకొన్ని వాయిద్యాల సహకారంతో ఉర్దూలోగానీ, హిందీలోగానీ ఉన్న సాహిత్యానికి మృదుమధురంగా ఉత్తర భారతీయ సంగీతకారులే గానం చేసే దృశ్యమే నాకు మనసుకు స్ఫురించేది. కానీ గజల్ అన్నది ఒక సాహిత్య ప్రక్రియ అనీ, ప్రతి గజల్ ఒక నిర్దిష్టమైన ఛందస్సు నియమాలకు బద్ధమై వుంటుందని తెలుసుకున్న తరువాత, ఛందోబద్ధమైన సాహిత్యం పట్ల మక్కువ వున్న నాకు గజళ్ళమీద మక్కువ ఎక్కువై వాటిని పరిశీలించడం మొదలుపెట్టాను. డా॥ నారాయణరెడ్డిగారి వంటివారు తెలుగులో గజల్ నియమానుసారం చాలా రచనలు చేసారని తెలుసుకున్న తరువాత తెలుగులో గజళ్ళు పరిశీలించడం మొదలుపెట్టాను. తెలుగుతో సహా అన్ని భాషలలోనూ నూటికి తొంభై శాతం గజళ్ళు శృంగారభరితమైన సాహిత్యమో, ఆధ్యాత్మికత నిండిన సాహిత్యమో కనిపిస్తాయి.

ఐతే, దాదాపు మూడు సంవత్సరాల క్రితం, తొలిసారిగా డా॥ ఉమాదేవి జంధ్యాలగారి 'మంచి మాసము మార్గశీర్షము' అన్న గజల్ కాకతాళీయంగా ముఖపుస్తకంలో నా కంటబడింది. సాధారణంగా ఏదైనా గేయం చదివినప్పుడు, నాలోని సంగీతకారుడు సహజంగా సంగీతపరమైన దృష్టిలోనే చూస్తాడు. నేను చదివిన ఈ గేయం (అప్పట్లో అది గజల్ అన్న విషయంపై ఎక్కువ దృష్టి పోలేదు)

చక్కగా నాకు చాలా ఇష్టమైన మిశ్రచాపు తాళంలో అతి చక్కగా ఇముడుతుందన్న విషయం గమనించిన తరువాత, దాని వివరాలు చదివి, ఇది గజల్ అని తెలుసుకుని, అక్కడినుంచి లింకుల సహాయంతో ఆవిడ వ్రాసిన ఇంకొన్ని గజళ్ళు కూడా చదివాను. నేను చదివిన మిగతావారి గజళ్ళు చాలా మటుకు గజల్ ఛందస్సు నియమాలలో ఇమడ్చడం కోసం కొన్ని పదాలను కుదించడం, మరి కొన్నింటిని పొడిగించడం చేయడమే గమనించాను. కానీ డా॥ ఉమాదేవి జంధ్యాల గారి గజళ్ళన్నీ చక్కగా లయలో నడవడం నాకు ఎంతో నచ్చింది. ప్రతి గజల్ పాడుకునేందుకు ఎంత అనువుగా వుందో గమనించిన తరువాత చదివిన వాటిని చదివినట్లుగా చాలా వాటిని వెంటనే నాకు తోచిన రాగంలో బాణీలు కట్టుకుంటూ నాకు నేనే పాడుకున్నాను. పాడుతున్నంతసేపూ ఏదో తెలియని మధురానుభూతికి లోనయాను.

ఐతే అప్పటిదాకా లయమీదనే దృష్టినుంచిన నేను గమనించని విషయం ఏమిటంటే నేను చదివిన అన్ని గజళ్ళు మధురభక్తిపరమైన సాహిత్యమనీ, అందుకే నేను ఆ మధురానుభూతికి లోనయాననీ. అప్పుడు వాటి శీర్షిక పేరు చూసి అవాక్కయాను. తమిళంలో ఉండడం మూలాన అర్థంకాకపోయినా వినగానే ఏదో భావోద్రేకానికి గురిచేసే తిరుప్పావై తెనుగుచేతలు ఇవని. ఇంత చక్కని కావ్యాన్ని తెలుగులో అనుసృజన చేయాలని, వాటిని గజల్ నియమాల ప్రకారం వ్రాయాలని తలపు వచ్చిన డా॥ ఉమాదేవి జంధ్యాలగారికి నా మనసులోనే అభినందనలు తెలుపుకున్నాను. చాలా రోజులుగా ముళ్ళపూడి వెంకటరమణగారి తెనుగు తిరుప్పావైకి బాణీలు కట్టి రికార్డు చేయాలని అనుకుంటున్న నాకు, డా॥ ఉమాదేవి జంధ్యాలగారి 'ధనుర్మాసం' చదివిన తరువాత, ఈ గజళ్ళకే ప్రచారం ఇవ్వాలన్న తలపు వచ్చింది. నా ఈ బృహత్ పథకానికి అనుమతి కోరుతూ డా॥ ఉమాదేవి జంధ్యాలగారికి నేను వ్రాసిన చిన్న సందేశానికి ఆవిడ ఇచ్చిన ప్రత్యుత్తరం, ఆ తరువాత కొద్ది గంటలలోనే 'ఉమ అక్క' అని నేను, 'తమ్ముడూ' అని ఆప్యాయంగా ఆవిడ నన్ను సంబోధిస్తూ వరుసలు కలుపుకునే స్థితికి పెరిగింది మా స్నేహం. ఆ ఆప్యాయతకు కరిగిపోయిన నేను, అన్ని గజళ్ళకూ బాణీలు కట్టి రికార్డు చేసేందుకు తయారుచేసి వుంచాను. కానీ అమెరికాలో ఉండడం

మూలాన, నేను ఉన్న చిన్న ఊళ్ళో వాయిద్యాలు వాయించేవారు లేకపోవడం మూలాన, 30 పాశురాలతో సహా మొత్తం 32 గేయాలు రికార్డింగుకు కావలసి అందరికీ కుదిరే సమయం దొరకకపోవడం మూలాన, అనుకున్నంత వేగంగా పని సాగలేదు.

ఇంత చక్కని సరళమైన సాహిత్యం, స్వతహాగా తనలో లయను ఇముడ్చుకుని, పాడుకునేందుకు ఎంతో అనువుగా వున్న ఈ గజళ్ళన్నింటినీ తిరుప్పావై ఇళ్ళలో పారాయణం చేసే ప్రతి తెలుగువారి నోట ఎం.ఎస్ సుబ్బలక్ష్మిగారి భజగోవింద స్తోత్రం తిరిగినట్లుగా తిరిగేలాగ చేయాలని దృఢసంకల్పంతో ఉన్నాను. నన్ను తమ్మునిగా ఆదరించిన ప్రియమైన ఉమఅక్కకు త్వరలోనే రికార్డు చేసి ప్రాచుర్యంలోకి తెస్తానని హామీ ఇస్తూ, ఈ గజళ్ళన్నింటినీ ఒక గ్రంథంగా విడుదల చేయాలన్న ఆవిడ సంకల్పానికి మద్దతు తెల్పుతూ, శుభాకాంక్షలు తెలుపుతూ, ఆవిడ తలపెట్టిన ఈ గ్రంథప్రచురణ కార్యక్రమం దిగ్విజయంగా సాగాలని ఆ శ్రీరంగనాథుని వేడుకుంటున్నాను.

**– శ్రీనివాస భరద్వాజ కిశోర్**

# ముందుమాట

**భ**గవద్బంధువులారా!

ధనుర్మాసంలో విష్ణ్వాలయాలలో మేలుకొలుపు సమయాన తిరుప్పావై పాడటం అనాదిగా వస్తున్న ఆచారం. తిరు అంటే శ్రీకరమైన. పావై అంటే వ్రతం. ద్వాపరయుగంలో గోపికలు శ్రీకృష్ణ భగవానుని పతిగా పొందాలని కాత్యాయనీవ్రతం చేసారట. అలాగే ఈ యుగంలో ఆండాళ్ (గోదాదేవి) తనను గోపికగా భావించుకొని శ్రీరంగనాథుని పతిగా పొందగోరి తన స్నేహితురాళ్ళతో కలిసి ధనుర్మాసవ్రతం ఆచరించింది. ముప్పది రోజులు రోజుకొక పాశురాన్ని పాడుతూ స్వామిని సేవించింది. ఈ పాశురాల సమాహారానికే తిరుప్పావై అని పేరు.

శ్రీవైష్ణవంలోని పన్నిద్దరు ఆళ్వారులలో ఏకైక మహిళా ఆళ్వారు గోదాదేవి. శ్రీవిల్లిపుత్తూరులో పెరియాళ్వారైన విష్ణుచిత్తులవారికి తులసీవనంలో భగవత్కృప వలన లభించింది ఒక చిన్నారి. కోదై అంటే మాల. భగవంతుని పూమాలగా తలచి ఆ పాపాయిని 'కోదై' అని పిలిచేవాడు. క్రమంగా 'గోదా'గా మారింది. భగవంతుని కోసం అల్లిన మాలను ముందు తాను ధరించి చూసుకొని తండ్రికి ఇచ్చేదట. అందుకే 'చూడికొడుత్త నాచియార్'గా తమిళంలోనూ, 'ఆముక్త మాల్యద'గా సంస్కృతంలోనూ ఆ తల్లిని కీర్తించారు. శ్రీరంగనాథుడు కూడా 'అప్పిన్నది' ధరించిన మాలే తనకు ప్రీతిదాయకమని విష్ణుచిత్తులవారికి చెప్పాడట. ఈ గాథను శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యద ప్రబంధంగా రచించాడు.

గోదాదేవి రచించిన తిరుప్పావై సకల వేదసారంగా, ముక్తిమార్గ బోధకమైన దివ్యప్రబంధంగా వాసికెక్కింది. భగవత్తత్వాన్ని తెలుసుకొని జీవాత్మ పరమాత్మను చేరడానికి మధురభక్తి మార్గంలో సాగి సాధించిన విజయమే గోదాదేవి చరిత్ర.

- ❖ మొదటి అయిదు పాశురాలలో ధనుర్మాస దీక్ష (మార్గశీర్ష వ్రతం) ముఖ్యోద్దేశం, వ్రత నియమాలు ఉపోద్ఘాతంగా వివరించటం జరిగింది. కేవలం తన అభీష్టసిద్ధి కోసం కాక పాడిపంటల కోసం, సకల ప్రాణికోటి

శ్రేయస్సు కోసం ధనుర్మాస వ్రతం చెయ్యాలని చెబుతుంది. గానలోలుడైన స్వామిని త్రికరణ శుద్ధిగా పూజించాలని ఉద్బోధిస్తుంది.

- ❖ తరువాత పది పాశురాలలో ధనుర్మాసంలో ప్రాతఃకాల వాతావరణ వర్ణన, చెలులను నిద్ర లేపి వ్రతానికి తనతోపాటు కదిలించటం ముఖ్య విషయాలు. కర్తవ్యాన్నీ, లక్ష్యాన్నీ మరిచి ఇహలోక సుఖంలో గాఢసుషుప్తిలో మునిగిన ఆత్మను జాగృతం చేయటమే అంతరార్థం. తనను గోపికగా, తన స్నేహితురాళ్ళను గోపికలుగా, విలుపుత్తూరునే గోకులమైన వ్రేపల్లెగా భావించుకొని మమేకమైపోవడం... మన భావనే భక్తికి ఆధారమనే సూచన కనబడుతుంది.
- ❖ తరువాతి తొమ్మిది పాశురాలలో నీళాదేవి భవన ద్వారపాలకుని లోపలికి పోనిమ్మని అడగడం, యశోదానందుల అనుమతి కోరడం, బలరామునికి విన్నపం చేసుకోవడం, నీళాదేవిని మేల్కొలుపడం, నీళాప్రియుడైన గోవిందుని వ్రతానికి కావలసిన పర, శంఖం మొదలైన సంభారాలు సమకూర్చమని ప్రార్థించటం ముఖ్యాంశాలు.
- ❖ చివరి పాశురం మార్గశీర్ష వ్రత ఫలశ్రుతి. వ్యాఖ్యాతలు ఈ పాశురాలలోని అనేకానేక ఆధ్యాత్మిక రహస్యాలను వివరిస్తూనే ఉన్నారు. అది తరగని గని.

తిరుప్పావై తెలుగులోకి అనువదించిన పెద్దలు, మహానుభావులు ఉన్నారు. గజల్ రూపంలో తిరుప్పావు ఎవరూ రాసినట్టు లేదు. అందుకే నేను తెలుగు గజల్స్‌గా తిరుప్పావై పాశురాలను వ్రాశాను. ఇది స్వేచ్ఛానువాదం. పాటకు అనుకూలంగా భావాన్ని కాస్త విస్తరించాను. ఇది చదివి పెద్దలు మార్పులు సూచిస్తే మలి ముద్రణలో చేరుస్తాను. మూల పాశురం పూజలో పాడుకున్న తరువాత తెలుగులో పాడుకునేందుకు అనుకూలంగా భిన్నగతులలో ఈ గజల్స్ తెలుగువారి కోసం రాశాను.

ఈ ప్రయత్నం శ్రీగోదారంగనాయకస్వామి, ఆండాళ్ తల్లి అనుగ్రహం వలననే జరిగింది. భక్తులకు నచ్చుతుందనే నమ్ముతున్నాను.

ఆండాళ్ తిరువడిగళే శరణం!

**డా॥ ఉమాదేవి జంధ్యాల**

# కృతజ్ఞతలు

**నా** 'తిరుప్పావై-గజల్ మాలిక'కు ముందుమాట వ్రాసి తమ మంగళా శాసనములు అందించిన సింహాచల దేవస్థానంవారి సంస్కృత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమునుండి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందిన, వైష్ణవతత్త్వ దార్శనికులైన శ్రీమాన్ టి.పి. రాఘవాచార్యులు అన్నగారికి పాదాభివందనములు.

భారత రక్షణవిభాగంలో శాస్త్రవేత్తగా పనిచేసి ప్రస్తుతం అమెరికా ఐటి మేనేజ్‌మెంట్‌లో ఉన్న బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ శ్రీనివాస భరద్వాజ కిషోర్ (టాలహాసీ, ఫ్లోరిడా) గాయకులుగా, సంగీత, నృత్యరూపక దర్శకులుగా, రచయితగా లబ్ధప్రతిష్ఠులు. నా తిరుప్పావై పాశురములను స్వరపరచి ప్రదర్శించే ప్రయత్నంలో ఉన్న తమ్ముడు (కిభశ్రీ) ముందుమాట వ్రాయటమేగాక ఏ పాశురం ఏ రాగతాళములలో స్వరపరిచారో ఒక పట్టికగా ఇచ్చారు. వారి అభిమానానికి కృతజ్ఞురాలిని.

హేవళంబి ధనుర్మాసంలో నా తిరుప్పావై గజళ్ళను రోజుకొకటి పాడి నా రచనకు మరింత ప్రాచుర్యం కలిగించిన నా మానస పుత్రిక శ్రీమతి లక్ష్మి రాయవరపు (కెనడా) గారికి నా కృతజ్ఞతలు.

ఫేస్‌బుక్‌లో తెలుగు గజల్ గ్రూపు, గజల్ వర్క్‌షాపు, అక్షరవనం గ్రూపులలో గజల్ రచనలో నాకు మెలకువలు నేర్పిన శ్రీమతి జ్యోతిర్మయి, ఆర్.వి.ఎస్.ఎస్. శ్రీనివాస్ మొదలైన మిత్రులకు ఈ సందర్భంగా నా కృతజ్ఞతలు తెలియ జేసుకుంటున్నాను.

ఈ పుస్తక ముద్రణలో తోడ్పడిన శ్రీ కంది శంకరయ్యగారికి, పుస్తకాన్ని ప్రచురించిన జె.వి. పబ్లికేషన్స్, హైదరాబాద్ అధినేత్రి శ్రీమతి జ్యోతి వలబోజు గారికి, పుస్తకాన్ని సకాలంలో అందంగా ముద్రించిన కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాదు వారికి కృతజ్ఞతలు.

**– ఉమాదేవి జంధ్యాల**

(రిటైర్డ్ రీడర్, తెలుగుశాఖ, జవహర్ భారతి డిగ్రీ కాలేజి, కావలి)

హైదరాబాద్.



## తిరుప్పావై-గజల్ మాలికలో...


| | | |
|---|---|---|
| ❖ ప్రార్థన - | తెలుగు గజల్ | 16–17 |
| ❖ పాశురం - 1 | తెలుగు గజల్ | 18–19 |
| ❖ పాశురం - 2 | తెలుగు గజల్ | 20–21 |
| ❖ పాశురం - 3 | తెలుగు గజల్ | 22–23 |
| ❖ పాశురం - 4 | తెలుగు గజల్ | 24–25 |
| ❖ పాశురం - 5 | తెలుగు గజల్ | 26–27 |
| ❖ పాశురం - 6 | తెలుగు గజల్ | 28–29 |
| ❖ పాశురం - 7 | తెలుగు గజల్ | 30–31 |
| ❖ పాశురం - 8 | తెలుగు గజల్ | 32–33 |
| ❖ పాశురం - 9 | తెలుగు గజల్ | 34–35 |
| ❖ పాశురం - 10 | తెలుగు గజల్ | 36–37 |
| ❖ పాశురం - 11 | తెలుగు గజల్ | 38–39 |

| | | |
|---|---|---|
| ❖ పాశురం – 12 | తెలుగు గజల్ | 40–41 |
| ❖ పాశురం – 13 | తెలుగు గజల్ | 42–43 |
| ❖ పాశురం – 14 | తెలుగు గజల్ | 44–45 |
| ❖ పాశురం – 15 | తెలుగు గజల్ | 46–47 |
| ❖ పాశురం – 16 | తెలుగు గజల్ | 48–49 |
| ❖ పాశురం – 17 | తెలుగు గజల్ | 50–51 |
| ❖ పాశురం – 18 | తెలుగు గజల్ | 52–53 |
| ❖ పాశురం – 19 | తెలుగు గజల్ | 54–55 |
| ❖ పాశురం – 20 | తెలుగు గజల్ | 56–57 |
| ❖ పాశురం – 21 | తెలుగు గజల్ | 58–59 |
| ❖ పాశురం – 22 | తెలుగు గజల్ | 60–61 |
| ❖ పాశురం – 23 | తెలుగు గజల్ | 62–63 |
| ❖ పాశురం – 24 | తెలుగు గజల్ | 64–65 |
| ❖ పాశురం – 25 | తెలుగు గజల్ | 66–67 |
| ❖ పాశురం – 26 | తెలుగు గజల్ | 68–69 |
| ❖ పాశురం – 27 | తెలుగు గజల్ | 70–71 |
| ❖ పాశురం – 28 | తెలుగు గజల్ | 72–73 |
| ❖ పాశురం – 29 | తెలుగు గజల్ | 74–75 |
| ❖ పాశురం – 30 | తెలుగు గజల్ | 76–78 |
| ❖ రాగం తాళం | | 79 |
| ❖ శ్రీ రంగనాథస్వామి అష్టోత్తర శతనామావళి | | 82 |
| ❖ శ్రీ గోదాదేవి అష్టోత్తర శతనామావళి | | 85 |

# తిరుప్పావై – గజల్ మాలిక

## ప్రార్థన - మూలం

నీళాతుంగ స్తనగిరితటీ సుప్తముద్బోధ్య కృష్ణం
పారార్థ్యం స్వం శ్రుతి శత శిర స్సిద్ధ మధ్యాపయంతీ
స్వోచ్ఛిష్టాయాం స్రజినిగళితం యా బలాత్కృత్య భుంక్తే
గోదా తస్యై నమ ఇద మిదం భూయ ఏవాస్తు భూయః

అన్నవయల్ పుదువై యాండాళ్, అరంగఱ్కు
పన్ను తిరుప్పావై ప్పల్ పదియం - ఇన్నిశై యాల్
పాడి క్కొడుత్తాల్ నఱ్పామాలై, పూమాలై
శూడి కొడుత్తాళై చ్చొల్లు,
శుడి క్కొడుత్త శుడర్కొడియే, తొల్పావై
పాడి యరుళవల్ల పల్ వళైయామ్! నాడి నీ
వేంగడవఱ్కు ఎన్నై విది యెన్ఱ ఇమ్మాత్తమ్
నాం కడవా వణ్ణమే నల్గు.

# తెలుగు గజల్

**గా**నామృతసుధలు పంచు జగదంబకు ప్రణతులివే!
కృష్ణభక్తి మధువు గ్రోలు మధుపమునకు ప్రణతులివే!

నీళాస్తన గిరుల సుప్త యదుసింహుని లేపితివే
నిగమార్థపు సారము గల గీతములకు ప్రణతులివే!

ముడిచినట్టి విరిదండల రంగని బంధించినావు
పూమాలలు అల్లిన కరకమలములకు ప్రణతులివే!

సుఖాలలో మత్తిల్లిన జగతికి గతి చూపితివే
మాతా నీ కరుణాన్విత హృదయమునకు ప్రణతులివే!

తులసీవన సంజాతా! పెరియాళ్వార్ ప్రియపుత్రీ!
భక్తి ముక్తిదాయకమౌ చరితమునకు ప్రణతులివే!

ఆండాళ్ తిరువడిగళే శరణం!

# పాశురం - 1 మూలం

**మా**ర్గళి త్తిజ్గల్ మది నిరైన్ద నన్నాళాల్!
నీరాడ ప్పోదువీర్, పోదుమినో నేరిలైయీర్
శీర్ మల్గుమ్ ఆయ్ ప్పాడి శెల్వచ్చిరు మీర్ కాళ్!
కూర్వేల్ కొడున్దొళిలన్ నన్దగోపన్ కుమరన్
ఏరార్న్ద కణ్ణి యశోదై యిళంశింగమ్!
కార్మేనిచ్చజ్గణ్ కదిర్మదియం బోల్ ముగత్తాన్
నారాయణనే నమక్కే పరైతరువాన్!
పారోర్ పుగళప్పడిన్దేలో రెమ్బావాయ్

- ❖ పరమ భాగవతోత్తముడైన విష్ణుచిత్తుని కుమార్తె గోదాదేవి శ్రీరంగని మనసున నిలుపుకొని ధనుర్మాసంలో మార్గశీర్షవ్రతం చేయ సంకల్పించింది. తనను తాను గోపికగా భావించుకొని, తన చెలికత్తెలను నిద్ర లేచి వ్రతదీక్ష పట్టమని కోరుతూ మార్గశిరమాసం గొప్పదనాన్ని ఈ పాశురంలో వివరిస్తున్నది!

# తెలుగు గజల్

మంచి మాసము మార్గశీర్షము తెలుసుకొనుడీ సుదతులారా!
తుంచి కోర్కెలు రంగనాథుని తలచుకొనుడీ సుదతులారా!

రోజురోజుకు పెరుగు చంద్రుడు వెండివెన్నెల కురియసాగెను
శుభము లిచ్చును శుక్లపక్షము మాట వినుడీ సుదతులారా!

మించనీయక తూర్పు వెలుగును స్నానమునకై తరలి వెళదాం
బద్ధకాన్నే వదిలిపెట్టీ మేలుకొనుడీ సుదతులారా!

రవి సుధాకర లోచనుండై జగతి కావగ వచ్చెనమ్మా
ఇరులు తరుమగ రవిని తెరిచెను వేగ చనుడీ సుదతులారా!

నందగోపుని ముద్దుబిడ్డగ వెలసెనమ్మా నందవ్రజమున
నీలమేఘశ్యాముడమ్మా తెలుసుకొనుడీ సుదతులారా!

యశోదమ్మకు ముద్దుపట్టిని బాలసింహుని చూడరమ్మా
నందనందను వ్రతము చేయగ బయటపడుడీ సుదతులారా!

నారాయణుని నమ్ముకుందాం పరను ఇచ్చేవా డతండే
బద్ధకించక కంకణాలను కట్టుకొనుడీ సుదతులారా!

# పాశురం - 2 మూలం

వైయత్తువాళ్ వీర్గాళ్! నాముం నం పావైక్కు!
శెయ్యుం కిరిశైగళ్ కేళీరో పాఱ్కడలుళ్
పైయత్తుయిన్ఱ పరమనడి పాడి!
నెయ్యుణ్ణోం పాలుణ్ణోం నాట్కాలే నీరాడి
మైయిట్టెళుదోం మలరిట్టు నాం ముడియోమ్!
శెయ్యాదన శెయ్యోం తీక్కుఱళై చ్చెన్ఱోదోమ్
ఐయముం పిచ్చైయుం ఆందనైయుం కైక్కాట్టి!
ఉయ్యుమాఱెణ్ణి ఉగందేలోర్ ఎమ్బావాయ్.

- ❖ శ్రీరంగనాథునికి అత్యంత ప్రియమైన ధనుర్మాసవ్రతంలో పాటించవలసిన నియమ నిబంధనల గురించి ఈ పాశురంలో ఆండాళ్‌తల్లి తన స్నేహితురాళ్ళకు చెబుతున్నది.

# తెలుగు గజల్

సుఖాలెన్నో అనుభవించాం చాలు చాలిక వనితలారా!
పరమసుఖమును పొందు దారిని వెదకవలెనిక వనితలారా!

శ్రీకరంబౌ ధనుర్మాసము రంగనాథుడు మెచ్చునట్టిది
శుభము నొసగే ఊర్ధ్వపుండ్రము దిద్దవలెనిక వనితలారా!

నోము నోమగ నియమనిష్ఠలు ప్రీతి మీరగ ముందు వినుడీ
దేహ మోహము, అలంకారము మానవలెనిక వనితలారా!

పూవులన్నీ కమలనాభుని కంఠమాలకు వాడుదామా
క్షీరఘృతములు గోపకాంతున కీయవలెనిక వనితలారా!

చిన్న పెద్దల నెవరినైనా తూలనాడుట మహాపాపము
పలుకరానివి చేయరానివి వీడవలెనిక వనితలారా!

జీవులన్నీ దేవుడనుకొని సకల జీవుల మేలు కోరుము
లోకకళ్యాణమును కోరుచు వ్రతము చేయుడు వనితలారా!

# పాశురం - 3 మూలం

**ఓం**గి యులగళన్ద ఉత్తమన్ పేర్పాడి!
నాంగళ్ నమ్బావైక్కు చ్చాట్రి నీరాడినాల్
తీంగిన్ఱి నాడెల్లామ్ తింగళ్ ముమ్మారి పెయ్దు!
ఓంగు పెరుమ్ శెన్నెల్ ఊడు కయలుగళ
పూంగువళై పోదిల్ పొరివణ్డు కణ్పడుప్ప!
తేంగాదే పుక్కిరున్దు శీర్ త్తములై పట్రి
వాంగక్కుడమ్ నిరైక్కుమ్ వళ్ళల్ పెరుమ్బశుక్కళ్!
నీంగాద శెల్వమ్ నిరైన్దేలో రెమ్బావాయ్

- ధనుర్మాసవ్రతం వలన వ్యక్తిగతమైన పరమార్థమే గాక, లోకానికి కూడా మేలు జరుగుతుందని తెలిపే మూడవ పాశురానికి గజల్ పాడుకుందాం.

## తెలుగు గజల్

దీక్ష పట్టి హరిచరితము చదువవలెనె సఖియరో!
విష్ణు మహిమ మనసారా పాడవలెనె సఖియరో!

వామనుడై వచ్చినాడు బలిని దానమడిగినాడు
భూనభములు కొలిచిన కథ పలుకవలెనె సఖియరో!

నెలకు మూడు వానలతో పంట బాగ పండుతుంది
జనావళికి సంక్షేమము తలచవలెనె సఖియరో!

సుభిక్షమౌ దేశాలే పరమాత్ముని స్మరణతోటి
సదాచార మర్చన యని తెలియవలెనె సఖియరో!

పాడి పంట కొరతుండదు వెల్లివిరియు ఆనందము
నోమిది యని నమ్మికతో చేయవలెనె సఖియరో!

# పాశురం - 4 మూలం

ఆళిమళైక్కణ్ణా! ఒన్ఱు నీ కైకరవేల్
ఆళియుళ్ పుక్కు ముగున్దు కొడార్తేరి
ఊళిముదల్వ నురువమ్పోల్ మెయికరుత్తు
పాళియందోళుడై పర్పనాబన్ కైయిల్
ఆళిపోళ్ మిన్ని, వలమ్బురి పోల్ నిన్ఱదిరిన్దు
తాళాదే శార్ఙ్గముదైత్త శరమళైపోల్
వాళవులగినిల్ పెయ్ దిడాయ్ నాంగళుమ్
మార్గళి నీరాడ మగిళిన్దేలో రెమ్బావాయ్.

- ఈ పాశురంలో... నల్లనయ్యను పోలిన నల్లని మబ్బులు రావాలని, పంటలు పండేలా వానలు కురవాలనీ, ఈ నోము అందుకేననీ అంటున్నది ఆండాళ్‌తల్లి. వ్రతము ఫలించి శ్రీరంగడు తనను వరించాలని తపిస్తున్నది.

# తెలుగు గజల్

నారాయణా! కరుణ చూపుమా వేగమే!
బ్రోవమని వరుణునకు చెప్పుమా వేగమే!

హరి ధనువు సిరికిచ్చె నారినే కట్టగా
శార్ఙ్గమే మాధవా పట్టుమా వేగమే.

శరపరంపరలాగ వర్షాలు కురవాలి
నీ చేతి చక్రమే విసరుమా వేగమే!

ఘనసుందరాకార మాపాలి పర్జన్య
వానదేవుని ఇటకు పంపుమా వేగమే!

దానగుణశీలునిగ ఖ్యాతినొందిన దేవ!
మేఘమా కరుణించి కురియుమా వేగమే!

కడలిలో నీరంత కడుపార త్రాగుమా
కన్నయ్య నలుపంత పొందుమా వేగమే!

పాంచజన్యము వోలె ఉరమాలి నింగిలో
సుదర్శన కాంతులే చూపుమా వేగమే!

వాగులూ కొలనులూ నిండాలి అంతటా
వరుణుడా వానలే కురియుమా వేగమే

మా నోము పండించి కావేటి రంగయ్య!
గోదనే పెళ్ళాడ కదలుమా వేగమే!

ఆండాళ్ళు కోరుకొను వరమిదే శ్రీరంగ!
దయదలచి నన్నింక బ్రోవుమా వేగమే

# పాశురం - 5 మూలం

**మా**యనై మన్ను వడమదురై మైందనై
తూయ పెరునీర్ యమునైత్తుఱైవనై
ఆయర్ కులత్తినిల్ తోన్రుం అణి విళక్కై
తాయై క్కుడల్ విళక్కం శెయ్ద దామోదరనై
తూయోమాయ్ వందు నాం తూమలర్ తూవి త్తొళుదు
వాయినాల్ పాడి మనత్తినాల్ శిందిక్క
పోయ పిళైయుం పుగుదురువాన్ నిన్రనవుం
తీయనిల్ తూశాగుం శేప్పేలోర్ ఎమ్బావాయ్

❖ ఆనాడు ద్వాపరయుగంలో కృష్ణుడిగా అవతరించినది శ్రీరంగనాథుడైన శ్రీమన్నారాయణుడేగా! యమునాతీరంలోని మధురలో యశోద తనయుడైన ఆ కృష్ణుని లీలలు చెబుతాను వినండమ్మా... అంటున్నది మన చూడికొడుత్త నాంచారి తన చెలియలతో... ఆ 5వ పాశురం గజల్‌గా మీరూ వినండి.

# తెలుగు గజల్

మధురవాసుని కృష్ణలీలలు పొగడతరమా కాంతలారా!
ముద్దులొలికే చిలిపి పనులను మరువతరమా కాంతలారా!

యశోదమ్మకు కడుపు పంటగ యదుకులంలో పుట్టెనమ్మా
మాయలెన్నో చేసినాడే నమ్మతరమా కాంతలారా!

గోపకాంతల నెన్ని తిప్పలు పెట్టినాడే చిక్కకుండా
కన్నతల్లికి గొల్లభామలు చెప్పతరమా కాంతలారా!

రోట గట్టగ ఱోలు నీడ్చి గుహ్యకుల శాపమును బాపెను
దామోదరుని మహిమలెన్నో ఎన్నతరమా కాంతలారా!

మనసు నిలిపీ పూజ చేసిన దూది మాదిరి కాలు పాపము
మధురవాసుల సుకృతాలే ఎంచతరమా కాంతలారా!

హరిని చేరే కోర్కె చాలును ఇతర కోరిక కోరవలదే
మోక్షముతో ఇతర కోర్కెల పోల్చతరమా కాంతలారా!

దనుజహారికి హారతిద్దాం పుణ్యపురుషుని పూజ చేద్దాం
బ్రోవమంటూ పాడకుండా ఉండతరమా కాంతలారా!

# పాశురం - 6 మూలం

పుళ్ళుం శిలుమ్బిన కాణ్ పుళ్ళరైయన్ కోయిల్
వెళ్ళైవిళి శంగిన్ పేరరవం కేట్టిలైయో
పిళ్ళాయ్! ఎళుందిరాయ్ పేయ్ములై నంజుండు
కళ్ళ చ్చగడం కలక్కళియ క్కాలోచ్చి
వెళ్ళత్తరవిల్ తుయిల్ అమరంద విత్తినై
ఉళ్ళత్తు క్కొండు మునివర్గళుం యోగిగళుం
మొళ్ళ ఎళుందరి ఎన్ఱ పేరరవం
ఉళ్ళం పుగుందు కుళిరుందేలోర్ ఎమ్బావాయ్.

- తెల్లవారుతున్నది. కాకులు అరుస్తున్నాయి. అవిగో కోవెల గంటలు... లేవండి. రాక్షస సంహారి అయిన హరిని పూజిద్దాం... అని తన తోటి వనితలను కూడా గోపెమ్మలుగా భావిస్తూ మేలుకొలుపుతున్నది ఆండాళ్ అమ్మ!

# తెలుగు గజల్

**కా**కుల అరుపులు కోవెల గంటలు వినబడలేదా మేలుకో చెలీ!
శంఖ నినాదము భక్తుల అలజడి జొరబడలేదా మేలుకో చెలీ!

కళ్ళను తెరచిన చాలదు తల్లీ మనసును కూడా తట్టి లేపవే
పరమార్థముకై ఆలోచనలే అలవడలేదా మేలుకో చెలీ!

విషమును చన్నుల పూసుకు వచ్చిన రక్కసి పూతన ప్రాణము తోడెను
ఎంతటివాడో నీకై నీకే కనబడలేదా మేలుకో చెలీ!

చంటిబిడ్డగా శకటాసురునీ ఉసురులు తీసిన నారాయణుడే!
యోగనిద్రలో శయనిస్తాడని చెవి బడలేదా మేలుకో చెలీ!

పరుగున రావే పూజలు చేస్తూ పాపాలన్నీ పారద్రోలుదాం
మంచి సమయమే మించిపోవునని భయమే లేదా మేలుకో చెలీ!

# పాశురం - 7 మూలం

**కీ**శు కీశెన్ఱెంగుం ఆనైచ్చాత్తన్ కలందు
పేశిన పేచ్చరవం కేట్టిలైయో పేయ్ ప్పెణ్ణే
కాశుం పిఱప్పుం కలకలప్ప క్కై పేర్ త్తు
వాశ నఱుం కుళల్ ఆయిచ్చియర్ మత్తినాల్
ఓ శైపడుత్త తయిర్ అరవం కేట్టిలైయో
నాయగ ప్పెణ్ పిళ్ళాయ్! నారాయణన్ మూర్త్తి
కేశవనై ప్పాడవుం నీ కేట్టే కిడత్తియో
తేశం ఉడైయాయ్! తిఱవేలోర్ ఎమ్బావాయ్.

❖ ఊహలలో గోపిక అయిపోయింది గోదాదేవి. ఆమెకు వ్రేపల్లె గోపెమ్మల పెరుగు చిలికే సవ్వడి వినిపిస్తున్నది. అప్పుడేమని తన స్నేహితురాళ్ళను మేలుకొలుపుతోందో చూడండి.

# తెలుగు గజల్

చెట్లమీద పక్షులన్ని మేతలకై సిద్ధమూ!
గోపాలురు ఆలమంద తోలుటకై సిద్ధమూ!

నువు మాత్రం ఇల్లు వదిలి రావింకా హరి పూజకు
చెలులంతా శీతల స్నానాలకై సిద్ధమూ!

గిరివ్రజమున గోపెమ్మల కృష్ణ ప్రేమ గుర్తుందా?
పాట పాడుతూ పెరుగును చిలుకుటకై సిద్ధమూ!

మధురమైన పాటలన్ని అంకితమా హరికే
సూత్రాలే తాళాలుగ మారుటకై సిద్ధమూ!

విరితావుల ఘుమఘుమలకు మేను పరవశింపగా
భామల పద పల్లవాలు నర్తనకై సిద్ధమూ!

కేశి చంపి కేశవుడై పరాక్రమం చూపెనే
కృష్ణమూర్తి జగద్రక్ష చేయుటకై సిద్ధమూ!

అందమైన గోవిందుడు అనుపమాన శూరుడే
నీ మది నిన్నే అడుగక వలచుటకై సిద్ధమూ!

# పాశురం - 8 మూలం

**కీ**ళ్ వానం వెళ్ళెన్టెరుమై శిఱు వీడు
మెయ్యాన్ పరందన కాణ్ మిక్కుళ్ళ పిళ్ళైగళుం
పోవాన్ పోగిన్టారై ప్పోగామల్ కాత్తు ఉన్నై-
క్కూవువాన్ వందు నిన్టోం కోదుగలం ఉడైయ
పాపాయ్! ఎళుందిరాయ్ పాడి ప్పఱై కొండు
మావాయ్ పిళందానై మల్లరై మాట్టియ
దేవాదిదేవనై చ్చెన్టు నాం శేవిత్తాల్
ఆవా ఎన్టారాయుందరుళ్-ఏలోర్ ఎంబావాయ్.

❖ తమస్సును తరిమి ఉషస్సు వచ్చినట్లు, అజ్ఞానాన్ని పారద్రోలి మనసులో వెలుగు నింపుకోవాలంటూ విష్ణుచిత్తుని ప్రియపుత్రిక మరికొందరు మిత్రులను మేలుకొలిపే వైనం ఈ 8వ పాశురం.

## తెలుగు గజల్

**తూ**ర్పు మనకు మార్గదర్శి తామసాన్ని వదలవే!
మనసు తెలుపు చేసుకోగ వాంఛలన్ని విడువవే!

నెచ్చెలులను వదలి నేను నీకోసం ఆగితే
మనోనాథు కలుసుకోగ పనులనన్ని మానవే!

నీ భక్తిని ఎరిగి నేను నీ తోడును కోరితే
ఇంద్రియాల అదుపుచేయు దారులన్ని నేర్పవే!

తనను చేరు తపన చూసి తనకు తాను తరలులే
దాసులమని దయజూపే సేవలన్ని చెప్పవే!

అశ్వరూపుడైన దైత్యు మూతి విరిచె వింటివా?
బుద్ధి చెరుచు తురంగాల పరుగులన్ని ఆపవే!

బాలుండై మల్లులనే మట్టుబెట్టె వింతగా
జగన్నాథు మనసు దోచు పాటలన్ని పాడవే!

# పాశురం - 9 మూలం

**తూ**మణి మాడత్తు చ్చుత్తుం విళక్కెరియ
దూపం కమళత్తుయిల్ అణైమేల్ కణ్ వళరుం
మామాన్ మగళే! మణి క్కదవం తాళ్ తిఱవాయ్
మామీర్! అవళై ఎళుప్పీరో ఉన్ మగళ్ తాన్
ఊమైయో అన్ఱి చ్చెవిడో అనందలో
ఏమ ప్పెరుందుయిల్ మందిర ప్పట్టాళో
మామాయన్ మాదవన్ వైకుందన్ ఎన్ఱెన్ఱు
నామం పలవుం నవిన్ఱేలోర్ ఎంబావాయ్

❖ మణిమయమైన మేడలో మెత్తటి పాన్పుపై నిద్రిస్తున్న మామకూతురిని పరంధాముని చింత చేయమంటూ నిద్రలేపుతున్న విధానం ఈ గజల్.

# తెలుగు గజల్

అగరుధూపం మత్తులోనే మితము మరిచీ నిదురపోకే!
మెత్తనైనా తల్పమందే జగము మరిచీ నిదురపోకే!

మణిమయంబౌ మేడచుట్టూ వెలుగుతున్నవి దీపకళికలు
తెల్లవారుట చూడకుండా పరము మరిచీ నిదురపోకే!

కృష్ణుడొస్తే ఏమి భయమను పొగరు మాటలు వదలవమ్మా
మామకూతుర! సుఖములో అంతరము మరిచీ నిదురపోకే!

గడియ తీయవె వడిగ రావే బదులు పలుకవు మూగవేమో
భ్రమలు వదిలీ బయలుదేరుము క్రమము మరిచీ నిదురపోకే!

చెవిటిదా నీ కూతురంటూ అడుగుతామే అత్తనిప్పుడు!
బద్ధకానే పారద్రోలుము వ్రతము మరచీ నిదురపోకే!

సకలసద్గుణధాముడమ్మా మహాలక్ష్మికి నాథుడమ్మా!
మనల బ్రోవగ ఇలకు వస్తే విధము మరిచీ నిదురపోకే!

# పాశురం - 10 మూలం

నోత్తు చ్చువర్క్కం పుగుగిన్ఱ అమ్మనాయ్
మాత్తముం తారాతో వాశల్ తిఱవాదార్
నాత్తత్తుళాయ్ ముడి నారాయణన్ నమ్మాల్
పోత్త ప్పఱై తరుం పుణ్ణియనాల్ పండొరునాళ్
కూత్తత్తిన్ వాయ్వీళంద కుమ్బకరణనుం
తోత్తుం ఉనక్కే పెరుందుయిల్ తాన్ తందానో
ఆత్త అనందల్ ఉడైయాయ్! అరుంగలమే
తేత్తమాయ్ వందు తిఱవేలోర్ ఎమ్బావాయ్.

- కుంభకర్ణుని సోదరిలా నిద్రపోతున్న ఒక చెలిని నిద్ర లేపాలని వెళ్ళింది గోదాదేవి. లోపల ఆమె పూజ పూర్తి అయి నిద్ర నటిస్తున్నదని అనుమానం వచ్చి అడుగుతున్నది! ఎందుకా అనుమానం వచ్చిందో పాట వింటే తెలుస్తుందిగా.

## తెలుగు గజల్

**త**లుపు తీయవద్దులేవె అందమైన ప్రియసఖీ!
బదులిచ్చుట చాలునులే ఇష్టమైన ప్రియసఖీ!

అందరివాడైనవాని డెందము నీ సొంతమాయె
కీర్తింతుము చూపించిన మేటివైన ప్రియసఖీ!

మన అందరి గోవిందుడె త్రేతాయుగ శ్రీరాముడు
విన్నావా ఆ గాథను చక్కనైన ప్రియసఖీ!

తన నిద్రను నీకిచ్చెను కుంభకర్ణు డనుకుంటిమి
కాక యోగనిద్రో యిది రమ్యమైన ప్రియసఖీ!

నోము పూర్తిచేసి తమరు శయనించితిరేమో మరి!
నల్లనయ్య పాదాలకు చేరువైన ప్రియసఖీ!

మేము కూడ నోము నోయ ముడుపు కట్టుకున్నాము
మా బ్రతుకులు పండించవె జ్ఞానివైన ప్రియసఖీ!

ఎల్లెడలా నిండినట్టి నారాయణుడే కృష్ణుడు
ఇంటిలోన దాచవలదు శ్రేయమైన ప్రియసఖీ!

తులసిమాల పరిమళాలు బయట పెట్టె స్వామి ఉనికి
పొలుపంచు వానిప్రేమ రుచిరమైన ప్రియసఖీ!

# పాశురం - 11 మూలం

**క**త్తుకఱవై క్కణ్గళ్ పలకఱందు
శెత్తార్ తిఱల్ అరియ చ్చెన్టు శెరుచ్చెయ్యుం
కుత్తం ఒన్టిల్లాద కోవలర్-దం పొఱ్కొడియే
పుత్తరవల్ గుల్ పునమయిలే పోదరాయ్
శుత్తత్తు త్తోరిమార్ ఎల్లారుం వందు నిన్-
ముత్తం పుగుందు ముగిల్ వణ్ణన్ పేర్-పాడ
శిత్తాదే పేశాదే శెల్వప్పెణ్డాట్టి నీ-
ఎత్తుక్కుఱంగుం పొరుళ్-ఏలోర్ ఎంబావాయ్.

❖ స్నేహితురాలిని నిద్ర లేపటానికి వెళ్ళి ఆమె వంశాన్ని, అందాన్ని, సామర్థ్యాన్ని మెచ్చుకుంటూ మేలుకోమని బుజ్జగిస్తున్నది ఆండాళ్ అమ్మ.

# తెలుగు గజల్

పోట్ల ఆవుల పాలు పితికే కిటుకు తెలిసిన గోపకాంతవు!
పగతు ప్రాణము పొదుగులాగా పిండ గలిగిన వీరవనితవు!

నాగమణివలె మెరిసిపోయే జఘన సుందరి చేయి కలుపుము
నెమలి పింఛపు నీలికాంతుల కురుల గలిగిన ముగ్ధ మెలతవు!

అందమంతా పోతపోసిన బొమ్మ వనుచూ చెప్పుకుంటాం
నందగ్రామమునందు పుట్టిన నేర్పు గలిగిన ధీరగరితవు!

తలచుకుంటే నిద్ర నెందుకు గెలువలేవో తెలియకున్నది
విష్ణుకీర్తన తియ్యతియ్యగ పాడ గలిగిన పల్లె ముదితవు!

యమునలోనా మునకలేసీ శ్రీనివాసుని భజన చేద్దాం
గొంతు కలిపీ మధురగీతం నేర్పవలసిన గొల్లనెలతవు!

మేలుకోవే మంచిపిల్లా! వ్రతము మాతో పంచుకోవే
రంగధాముని చేరుకోగా దారి తెలిసిన స్నేహ చరితవు!

# పాశురం - 12 మూలం

**క**నైత్త్-ఇళం కత్తెరుమై కన్టుక్కిరంగి
నినైత్తు ములై వరియే నిన్టు పాల్ శోర
ననైత్త్-ఇల్లం శేఱాక్కుం నచ్చెల్వన్ తంగాయ్
పనిత్తలై వీరనిన్ వాశల్ కడై పత్తి
శినత్తినాల్ తెన్ ఇలంగై క్కోమానై చ్చెత్త
మనత్తుక్కినియానై ప్పాడవుం నీ వాయ్ తిఱవాయ్
ఇనిత్తాన్ ఎరుందిరాయ్ ఈదెన్న పేర్ ఉఱక్కమ్
అనైత్తు ఇల్లత్తారుమ్ ఏల్ ఓర్ ఎంబావాయ్.

❖ గోకులంలో గోసంపద, గోపాలకులకు గోవులపై గల శ్రద్ధను వర్ణించిన పాశురమిది. త్రేతాయుగ అవతారమైన రాముడే గోవిందుడని చెబుతూ వ్రతానికి పిలుస్తున్నది.

## తెలుగు గజల్

**అ**న్నకేమో ఆ అనంతుని సేవలోనే గడిచె కాలం!
చెల్లికేమో అంతులేనీ నిద్రతోనే గడిచె కాలం!

లేగదూడల అరుపు వినబడ పొదుగు చేపెను పాడి ఆవులు
యాదవునకా శ్యామసుందరు స్మరణతోనే గడిచె కాలం!

పాలధారలు కారిపోగా కొట్టమంతా బురద బురదే!
మంచు కమ్మిన వేగుజామున వణుకుతోనే గడిచె కాలం!

కింద బురదకు పైన మంచుకు తాళజాలము వేళమించెను
జామునించీ చూరు పట్టుకు పిలుపుతోనే గడిచె కాలం!

పత్ని సీతను రక్ష సేయగ రావణాసురుఁ జంపె రాముడు
రామకథనే పాడుదామన జాగుతోనే గడిచె కాలం!

# పాశురం - 13 మూలం

**పు**ళ్ళిన్ వాయ్ కీండానై ప్పొల్లా అరక్కనై
కిళ్ళి క్కళైందానై కీర్-త్తిమై పాడి ప్పోయ్
పిళ్ళైగళ్ ఎల్లారుం పావైక్కళం పుక్కార్
వెళ్ళి యెరుందు వియారం ఉఱంగిత్తు
పుళ్ళుం శిలమ్బిన కాణ్ పోదరి క్కణ్ణినాయ్
కుళ్ళ కుళిర క్కుడైందు నీరాడాదే
పళ్ళి క్కిడత్తియో పావాయ్! నీ నన్నాళాల్
కళ్ళం తవిరుందు కలంద్-ఏలోర్ ఎంబావాయ్.

- లోకోద్ధరణకై అసుర సంహారులుగా అవతరించిన రామకృష్ణులను పూజించవలసిన మార్గశిరమాసంలో ప్రదోషవేళ నిర్మలమైన మనసుతో స్వామిపూజ శుభప్రదమని చెప్పే పాశురమిది.

# తెలుగు గజల్

**చి**గుళ్ళ వలె దశకంఠుని శిరసులనే కోసినాడు
బద్ద వలే బకాసురుని నాసికనే చీల్చినాడు!

రాముడాయె కృష్ణుడాయె లోకాలను ఉద్ధరింప
మనకోసం ప్రేమామృతభాండమునే తెచ్చినాడు!

వాని మహిమ కీర్తింపగ హరిణాక్షీ కలవవేమె?
వేణువూది మనసు దోచి విరహమునే పెంచినాడు!

విరహాగ్నిని చల్లార్చక శయనించితివేమి సఖీ!
వ్రతము చేయ రాకుండా మాయలనే కప్పినాడు!

గురుశుక్రులు గతులు మారు ప్రదోషంపు కాల మిదియె
భాస్కరుండు శుభముహూర్త ఘడియలనే చేరినాడు!

పద్మలమై కొలనులోకి దిగుదామా స్నానాలకు
తుమ్మెదవలె నల్లనయ్య లోపలనే తిరిగినాడు!

కపటమునే వీడి వచ్చి గానములో గొంతు కలుపు
దైవంబే నీ గళమున మధువులనే నింపినాడు!

# పాశురం - 14 మూలం

**ఉం**గళ్ పుళైక్కడై త్తోట్టత్తు వావియుళ్
శెంగరునీర్ వాయ్ నెగిర్ అంద్ ఆమ్బల్ వాయ్ కూమ్బిన కాణ్
శెంగల్పొడి క్కూరై వెణ్బల్ తవత్తవర్
తంగళ్ తిరుక్కోయిల్ శంగిడువాన్ పోగిన్ఱార్
ఎంగళై మున్నం ఎరుప్పువాన్ వాయ్ పేశుమ్
నంగాయ్! ఎరుందిరాయ్ నాణాదాయ్! నావుడైయాయ్
శంగాడు చక్కరం ఏందుం తడక్కైయం
పంగయ క్కణ్ణానై ప్పాడ-ఏలోర్ ఎంబావాయ్.

- ❖ ఎన్నో చేద్దామనుకొని చేసే సమయానికి బద్ధకించటం కార్యశీలురకు తగదు కదా! అటువంటి చెలిని ఏమన్నావో గుర్తు చేసుకోమంటున్నది.

# తెలుగు గజల్

**చె**ప్పిన మాటలు తప్పెదవేమే... ఏమన్నావో గుర్తు చేసుకో
మంచంపైనే కదిలెదవేమే... ఏమన్నావో గుర్తు చేసుకో!

కలువలు వాడెను. విచ్చె కమలములు... పెరడున ఉన్నా దిగుడు బావిలో
మీన మేషములు ఎంచెదవేమే... ఏమన్నావో గుర్తు చేసుకో!

అందరికన్నా ముందే లేచీ నిద్ర లేపుతా నంటివి గదటే
మౌనవ్రతమే పూనెదవేమే... ఏమన్నావో గుర్తు చేసుకో!

కాషాయాంబరధారులు మౌనులు... రంగని సేవకు గుళ్ళకు వెళ్ళిరి
ఇంతాలస్యము చేసెదవేమే... ఏమన్నావో గుర్తు చేసుకో!

శంఖము చక్రము దాల్చినవానీ... మహిమల కీర్తన మధురము గాదా!
వలచిన కృష్ణుని మరిచెదవేమే... ఏమన్నావో గుర్తు చేసుకో!

ఆయతబాహుడు తామరసాక్షుడు... గానలోలుడే నందబాలుడూ
పుట్టెడు ఆశలు వమ్ము చేయకే... ఏమన్నావో గుర్తు చేసుకో!

# పాశురం - 15 మూలం

ఎల్లే! ఇళంకిళియే! ఇన్నం ఉఱంగుదియో
శిల్ ఎన్ఱ్ అరైయేన్మిన్ నంగైమీర్! పోదరుగిన్ఱేన్
వల్లై ఉన్ కట్టురైగళ్ పండేయున్ వాయఱిదుమ్
వల్లీర్గళ్ నీంగళే నానే తాన్ ఆయిడుగ
ఒల్లై నీ పోదాయ్ ఉనక్కెన్న వేఱుడైయై
ఎల్లారుం పోందార్ పోందార్ పోంద్-ఎణ్ణిక్కోళ్
వల్లానై కొన్ఱానై మాత్తారై మాత్తరిక్క
వల్లానై మాయనై ప్పాడ-ఏలోర్ ఎమ్బావాయ్.

- ఇంత రాత్రి మీ గొడవేమిటనే స్నేహితురాలికి తెల్లవారింది, పూజకు వేళయింది లేవమని నిద్రలేపుతున్నారు. ఏం పాటలు పాడాలో చెబుతున్నారు. సంభాషణ రూపంలో సాగిన పాశురమిది.

## తెలుగు గజల్

లేత చిలుకా వంటి లేమా! తలుపు తీయవె సుందరాంగీ!
ఇంత రాతిరి వచ్చి గొడవా ముందు చెప్పవె సుందరాంగీ!

తెల్లవారెను నమ్మవమ్మా వచ్చి చూడూ తెలుస్తుందీ
మొత్తమంతా కూడినారా నిజము పలుకవె సుందరాంగీ!

పడక వదిలీ బయటికొచ్చీ లెక్కపెట్టవె తెలుస్తుందీ
కృష్ణ భజనలు నీవు కూడా ఆలపించవె సుందరాంగీ!

ఏమి పాటలు పాడవలెనో వివరమంతా చెప్పరాదా?
నీకు తెలియని కథలు కావివి అవధరింపవె సుందరాంగీ!

కువలయపీడ నామధేయుడు గజాకారుడు రక్కసుండు
చిటికలోపల వాని చంపిన గాథ పాడవె సుందరాంగీ!

మామ కంసుని పీడ బాపీ కన్నవారికి సుఖము గూర్చెను
తాతగారిని రాజు చేసిన హరిని తలచవె సుందరాంగీ!

తిరుప్పావై పాడుకుంటూ కలిసి నోములు నోచుకుందాం
రంగరంగని అంతరంగమునందు నిలువవె సుందరాంగీ!

# పాశురం - 16 మూలం

**నా**యగనాయ్ నిన్ఱ నందగోపనుడైయ
కోయిల్ కాప్పానే! కొడిత్తోన్ఱుం తోరణ
వాశల్ కాప్పానే, మణిక్కదవం తాళ్ తిఱవాయ్
ఆయర్ శిఱుమియరోముక్కు అఱై పఱై
మాయన్ మణివణ్ణన్ నెన్నలే వాయ్-నేర్ న్దాన్
తూయమాయ్ వందోం తుయిలెర ప్పాడువాన్
వాయాల్ మున్నం మున్నం మాత్తాదే అమ్మా
నీ నేశనిలైక్కదవం నీక్కు-ఏలోర్ ఎంబావాయ్.

- సఖియలను మేలుకొలిపి తనతో చేర్చుకొని శ్రీహరి నివాసానికి చేరుకున్నది. భవన పాలకుని తలుపు తీయమని అడుగుతున్న పాశురం.

# తెలుగు గజల్

భువనపాలకు భవనపాలక! తలుపు తెరువుము హరిని చూడగ!
మణులు పొదిగిన మహాద్వారపు గడియ తీయుము హరిని చూడగ!

'పరను ఇస్తా రండి' అనెనే! సందియాన్నే తీర్చుకొనిరా
మురళి ఊదక నోము కాదే వెళ్ళనీయుము హరిని చూడగ!

సకల జీవుల సుఖం కోరీ ధనుర్మాసం మొదలుపెట్టాం
దీక్ష మంచిది అడ్డుపడకుము – దారి వదలుము హరిని చూడగ!

అసుర వనితలు అనుకునేవో? భక్తురాళ్ళము స్వామివారికి!
చెలిమి చేసిన చెలులమయ్యా ఆపబోకుము హరిని చూడగ!

మనసు నిచ్చిన ముద్దుగుమ్మల కానివారిగ కన్న డెంచడు
తలుపు రెక్కలు తెరువవయ్యా – చేయి సాయము హరిని చూడగ.

# పాశురం - 17 మూలం

**అ**మ్బరమే తణ్ణీరే శొఱే అఱం శెయ్యుం
ఎమ్బెరుమాన్ నందగోపాలా! ఎరుందిరాయ్
కొన్బనార్ క్కెల్లాం కొరుందే! కుల విళక్కే
ఎమ్బెరుమాట్టి యశోదా! అఱివుఱాయ్
అమ్బరం ఊడఱుత్తు ఓంగి ఉలగళంద
ఉమ్బర్ కోమానే! ఉఱంగాదు-ఎరుందిరాయ్
శెమ్బొఱ్ కరలడి చ్చెల్వా బలదేవా!
ఉమ్బియుం నీయుం ఉఱంగ్-ఏలోర్ ఎంబావాయ్.

- భవనంలోకి ప్రవేశించిన గోపికలు ఆ నారాయణునకే జననీ జనకులైన యశోదా నందులను, బలశాలి బలరాముని, యదుకుల భూషణమైన కన్నయ్యను నిద్ర లేపుతున్నారు.

# తెలుగు గజల్

శ్రీనందగోపాల శ్రితపారిజాతమా మేలుకో!
నారాయణుని గన్న గోకులపు పుణ్యమా మేలుకో!

నీరిచ్చి నీడిచ్చి నిత్యాన్నదానమే చేతువే
సాకారమైనట్టి నిలువెత్తు ధర్మమా మేలుకో!

సుకుమారి సుమగాత్రి ఓ యశోదమ్మా నిదురలే!
స్త్రీజాతి రత్నమా వ్రేపల్లె దీపమా మేలుకో!

అన్నగా వచ్చాడు ఆ ఆదిశేషుడే ఎరుగరే
బలశాలి బలరామ అసమాన తేజమా మేలుకో!

యదువంశ తిలకమా! మా చిన్న కృష్ణయ్య స్వామిరా!
సాకారమైనట్టి భక్తజన స్వప్నమా మేలుకో!

# పాశురం - 18 మూలం

**ఉం**దు మదకళిత్తన్-ఓడాద తోళ్ వలియన్
నందగోపాలన్ మరుమగళే! నప్పిన్నాయ్!
కందం కమరుం కురలీ కడై తిఱవాయ్ వంద్
ఎంగుం కోరి అరైత్తన కాణ్ మాదవి
ప్పందల్ మేల్ పల్గాల్ కుయిల్ ఇనంగళ్ కూవిన కాణ్
వందార్ విరలి ఉన్ మైత్తునన్ పేర్ పాడ
శెందామరై క్కైయాల్ శీరార్ వళై ఒలిప్ప
వందు తిఱవాయ్ మగిరింద్-ఏలోర్ ఎంబావాయ్.

❖ నందుని కోడలూ, కృష్ణప్రియ అయిన నీళాదేవిని గోపికలంతా నిద్ర లేపుతున్నారు. కృష్ణుడు ఆమె ప్రేమకు కట్టుబడినవాడు కదా! నీళాదేవితో వెళితే స్వామి త్వరగా అనుగ్రహిస్తాడని వారి ఆశ.

# తెలుగు గజల్

గజబలుడు భుజబలుడు నందునీ కోడలివి రావమ్మ నీళమ్మ!
వెనుకంజ నెరుగనీ యదువంశ భామినివి రావమ్మ నీళమ్మ!

కదనరంగమునందు నీ మెట్టినింటికే సాటి లేనేలేరు
పరిమళము వెదజల్లు కురులున్న సుందరివి రావమ్మ నీళమ్మ!

కొక్కొరొక్కో అంటు కోళ్ళన్ని కూశాయి వినిపించెనా తల్లి
మాధవీలతపైన కోయిలలు పాడినవి రావమ్మ నీళమ్మ!

తెలవారె మాపైన దయజూపి వెంటనే తలుపులను తీయుమా
కరకమలములు కదల గాజులే మోగినవి రావమ్మ నీళమ్మ!

మీ బావ కృష్ణుణ్ణి పొగడగా వచ్చాము ఒకసారి చూడుమా
నీ రాక కోసమై మా కళ్ళు వెతికినవి రావమ్మ నీళమ్మ!

# పాశురం - 19 మూలం

**కు**త్తు విళక్కెరియ కోట్టుక్కాల్ కట్టిల్మేల్
మెత్తెన్ఱ పంచ శయనత్తిన్ మేల్ ఏఱి
కొత్తలర్ పూంగురల్ నప్పిన్నై కొంగైమేల్
వైత్తు క్కిడంద మలర్ మార్బా! వాయ్ తిఱవాయ్
మైత్తడం కణ్ణినాయ్! నీ ఉన్-మణాళనై
ఎత్తనై పోదుమ్ తుయిల్ ఎళ ఒట్టాయ్ కాణ్
యేలుం పిరవాఱ్ఱ గిల్లయాల్
తత్తువమన్ఱు తగవ్-ఏలోర్ ఎంబావాయ్.

❖ లోకరక్షకునే తన వక్షస్థలంపై నిదురపుచ్చగల భాగ్యశాలి నీళాదేవిని నిదురలేచి పతిని తమ వ్రతానికి పంపించమని అభ్యర్థిస్తున్నారు గోపికలు ఈ పాశురంలో.

# తెలుగు గజల్

నీలాదేవీ! కృష్ణుడు నీతో లోపల కలడని తెలిసే వచ్చాం!
నీ కౌగిలిలో జగమే మరచీ శయనించాడని తెలిసే వచ్చాం!

గుత్తుల గుత్తుల దీపాలున్నవి పట్టెమంచమే ప్రకాశించినది
చూడ చక్కనీ నీలను వీడీ మంచం దిగడని తెలిసే వచ్చాం!

ఎత్తుగ మెత్తగ విశాలమైనా ఏనుగు దంతపు కోళ్ళమంచ మది
శయన సుఖాన్నే పంచే పత్నికి దూరము కాడని తెలిసే వచ్చాం!

కాటుక కళ్ళూ నల్లని కురులూ నీల పేరు నీ కమరెను చక్కగ
పూల సుగంధం మత్తు గొలుపగా పవళించాడని తెలిసే వచ్చాం!

నీ వక్షముపై లోకరక్షకుని నిదురపుచ్చగల భాగ్యశాలివీ
నీవు పంపనిది భువనమోహనుడు మాకు దొరకడని తెలిసే వచ్చాం!

హరిసమేతవౌ నీలాసుందరి! భక్తుల బ్రోవగ వేగ మేలుకో
పతియూ గతియూ మాకందరికీ నారాయణుడని తెలిసే వచ్చాం!

# పాశురం - 20 మూలం

**ము**ప్పత్తు మూవర్ అమరర్కు మున్ శెన్ఱు
కప్పం తవిర్కుం కలియే! తుయిల్ ఏరాయ్
శెప్పం ఉడైయాయ్! తిఱలుడైయాయ్ శేత్తార్కు
వెప్పం కొడుక్కుం విమలా! తుయిల్ ఎరాయ్
శెప్పన్న మెల్-ములై చ్చెవ్వాయ్ చ్చిఱు మరుంగుల్
నప్పిన్నై నంగాయ్! తిరువే! తుయిలెరాయ్
ఉక్కముం తట్టొళియుం తందు ఉన్-మణాళనై
ఇప్పోదే ఎమ్మై నీరాట్టు-ఏలోర్ ఎంబావాయ్.

❖ "ముక్కోటి దేవతల ఆపదలను తొలగించగల కృష్ణా! నిదుర లేచి మా నోముకు కావలసిన వస్తువుల నివ్వు" అని గోపికలు ఈ పాశురంలో స్వామిని మేలుకొలుపుతున్నారు.

## తెలుగు గజల్

ముక్కోటి దేవతల ఇడుములను తొలగించు నా స్వామి మేలుకో!
అర్థాంగి యెదపైన హాయిగా పవళించు నా స్వామి మేలుకో!

భక్తజన మందార మా హృదయ సంచార మురహరీ నరహరీ
నిన్ను నమ్మినవారి శత్రువుల నిర్జించు నా స్వామి మేలుకో!

బంగారు కలశాల పోలేటి కుచశోభగల చాన నీనీళ
నీళతో శృంగార సామ్రాజ్య మేలించు నా స్వామి మేలుకో!

ఓ దేవి! శ్రీహరిని కట్టేసుకోకమ్మ మము బ్రోవ పంపించు
మధు మురళి వాయించి ఆర్తినే తొలగించు నా స్వామి మేలుకో!

అందమే చూపగా అద్దమూ, వీచగా చామరము కావాలి
ఆ రెండు మాకిచ్చి మా నోము పండించు నా స్వామి మేలుకో!

# పాశురం - 21 మూలం

ఏత్త కలంగళ్ ఎదిర్ పొంగి మీదళిప్ప
మాత్తాదే పాల్ శొరియుం వళ్ళల్ పెరుం పశుక్కళ్
ఆత్త ప్పడైత్తాన్ మగనే! అఱివుఱాయ్
ఊత్త ముడైయాయ్! పెరియాయ్! ఉలగినిల్
తోత్తమాయ్ నిన్ద శుడరే! తుయిల్ ఎరాయ్
మాత్తార్ ఉనక్కు వలి తొలైందు ఉన్-వాశఱ్కణ్
ఆత్తాదు వందు ఉన్-అడిపణియుమా పోలే
పోత్తియాం వందోం పుగరందు-ఏలోర్ ఎంబావాయ్.

❖ కుండలు నిండి పొంగిపోయేటన్ని పాలు ఇచ్చే గోసంపద గల నందుని కుమారుడైన కృష్ణుని గోపికలు శరణాగతి కోరుతున్నారు. లోకాధి నాథుడైనా, శత్రువులను పాదదాసులను చేసుకున్న ధీరుడైనా ఆలమందలు గాచిన ఆయన సౌజన్యాన్ని ఈ పాశురంలో పొగడు తున్నారు.

# తెలుగు గజల్

గోసంపదున్నట్టి నందునీ గృహమందు జన్మించినావయ్య కృష్ణా!
పాలకుండలు నిండి పొర్లిపోయేటంత పాలిచ్చునంటయ్య కృష్ణా!

అప్రమేయుడవయ్యు ఆలమందలు గాచు దృఢమూర్తి నా స్వామి రారా!
వాకిటను శత్రువులు నీ పాదదాసులై పడియున్నవారయ్య కృష్ణా!

శరణాగతిని కోరి చరణాలు పూజింప వనితలము వచ్చాము దేవా!
మాకు దర్శనమిచ్చి వ్రతమునకు విచ్చేసి కరుణింప రావయ్య కృష్ణా!

గగనాన వెలిగేటి జ్యోతిస్వరూపమా! కనిపించుమా ఒక్కసారీ
మనసునే పరిచేము నీవు వచ్చే దారి నిదురింక చాలయ్య కృష్ణా!

మంగళాశాసనము చేయగా వచ్చాము కొండంత ఆశతో మేమూ!
నిను వీడి మనలేక నీది యీ బ్రతుకనుచు పాడుతున్నామయ్య కృష్ణా!

# పాశురం - 22 మూలం

అంగన మాలత్తరశర్, అభిమాన
పంగమాయ్ వందు నిన్ పళ్ళికట్టిల్ కీరే
శంగమ్ ఇరుప్పార్ పోల్ వందు తలై ప్పెయ్-దోమ్
కింగిణివాయ్ చ్చేయ్ద తామరై ప్పూప్పోలే
శెంగణ్ శిఋచ్చిఱిదే యెమ్మేల్ విరయావో
తింగళుమ్ ఆదిత్తియనుమ్ ఎరుందాఱ్పోల్
అంగణ్ ఇరండుం కొండు ఎంగళ్మేల్ నోక్కుదియేల్
ఎంగళ్మేల్ శాపం ఇరింద్-ఏలోర్ ఎమ్బావాయ్.

❖ తామరస నయనా కృష్ణా! మా అహాన్ని విడిచిపెట్టాము. దేహాభిమానాన్ని విడిచాము. నీ అనుగ్రహం కోరి వచ్చామంటున్నారు గోపికలు!

# తెలుగు గజల్

చిరుగంటల పోలినవీ అరవిచ్చిన నయనాలను తెరువు ప్రభూ!
సరసిజాల సిగ్గు పరచు మన్మోహన సితాక్షులను తెరువు ప్రభూ!

విర్రవీగు సామంతుల పాదాక్రాంతులను చేయు జగత్పతీ!
అహము విడిచి వరము కోరు మము చూడగ నీ కనులను తెరువు ప్రభూ!

దేహముపై అభిమానము వదిలినాము – దేవునికై కదిలినాము
అనురాగము పరాగమౌ అరుణారుణ నేత్రాలను తెరువు ప్రభూ!

కళ్ళు విప్ప సూర్యచంద్రు లొక్కసారి ఉదయించిన తీరు గదా!
కర్మలనే అనుభవింప శాసింపక చక్షువులను తెరువు ప్రభూ!

ఉల్లములను దోచుకున్న నీ దివ్య చరణములే శరణంటిమి
నీ కటాక్ష వీక్షణాలు శాపాలను బాపగలవు – ఈక్షణలను తెరువు ప్రభూ!

# పాశురం - 23 మూలం

**మా**రి మలై ముళైంజిల్ మన్ని క్కిడందుఱంగుం
శ్రీరియ శింగం అరివుత్తు త్తీవిళిత్తు
వేరి మయర్ పొంగ ఎప్పాడుం పేరుందుదఱి
మూరి నిమిరుందు మురంగి ప్పుఱప్పట్టు
పోదరుమా పోలే నీ పూవైప్పూ వణ్ణా ఉన్
కోయిల్ నిన్టు-ఇంగనే పోందరిళి క్కోప్పుడైయ
శీరియ శింగాశనత్తిరుందు యాం వంద
కారియం ఆరాయ్-అందరుళ్-ఏలోర్ ఎమ్బావాయ్

❖ గుహలో నిద్రించే సింహం ఒళ్ళు విరుచుకొని, ధూళి దులుపుకుంటూ బయటికి వస్తున్నట్లు కృష్ణుడు నిద్ర లేచి వస్తున్నట్లు కనిపించింది గోపికలకు. ఈ పాశురంలో వారు పరమాత్మకు స్వాగతం పలుకుతున్నారు.

## తెలుగు గజల్

**లో**కాలను పాలించే పెరుమాళ్ళుకు స్వాగతం!
పాపాలను పోకార్చే పరమాత్మకు స్వాగతం!

గుహ లోపల నిద్రించే సింహంలా లేచావు
పరాక్రమం ప్రకటితమౌ ఉపేంద్రునకు స్వాగతం!

ఒళ్ళు విరిచి ధూళి దులిపి లేచేనా హర్యక్షము
అనిపించగ వచ్చు పురుషసింహమునకు స్వాగతం!

ఈ కేసరి గర్జనతో అరి గుండెల దడేదడ
సింహాసన మధిష్ఠింప వల్లభునకు స్వాగతం!

మా రాకను ఎరుగననీ నొచ్చుకోకు ప్రియతమా
చివురాకుల వంటి నీ పాదాలకు స్వాగతం!

ఇంతసేపు ఇక్కడిలా ఆపానని అనుకోకు
అతసీపుష్పము పోలిన రూపమునకు స్వాగతం!

మహనీయం నీ చరితం గణనీయం విక్రమం
దుష్ట శిక్షణను జేసిన దైవమునకు స్వాగతం!

లోకోత్తర అవతారం ముక్తిపథం స్మరణమే
వేగముగా వేంచేసే ఇలవేల్పుకు స్వాగతం!

# పాశురం - 24 మూలం

**అ**న్టివ్వులగమ్ అళందాయ్ అడి పోత్తి
శెన్టంగు త్తెన్-ఇలంగై శెత్తాయ్ తిఱల్ పోత్తి
పొన్టచ్చకడం ఉదైత్తాయ్ పుగళ్ పోత్తి
కన్టుకుణిలా వెఱిందాయ్ కళల్ పోత్తి
కున్టుకుడైయా వెడుత్తాయ్ కుణం పోత్తి
వెన్టు పకై కెడుక్కుమ్ నిన్ కైయిల్ వేల్ పోత్తి
ఎన్టెన్టుమ్ శేవకమే యేత్తి ప్పఱైకొళ్వాన్
ఇన్టు యాం వందోం ఇరంగ్-ఏలోర్ ఎంబావాయ్.

❖ దుష్ట శిక్షణకు అవతరించిన ఆ శ్రీమన్నారాయణుని లీలలు కొనియాడుతూ శ్రీహరి చరణారవిందాలకు మంగళహారతినిస్తూ పాడుతున్న పాశురమిది.

# తెలుగు గజల్

**పూ**రేకులను బోలి సుకుమారమైనట్టి దివ్యపాదాలకూ పాడరే మంగళము
నడిచినందుకు కంది ఎఱ్ఱబడిపోయినట్టి పాదపద్మాలకూ పాడరే మంగళము!

జగములకు నాథుండు అని మరచి నడిపించి పాపమే చేశాము
మన్నించమందాము
మూడడుగులను అడిగి ముల్లోకములు కొలుచు మహిత చరణాలకూ పాడరే
మంగళము!

మాయ వేషము వేసి జానకిని గొనిపోయి లంకలో దాచాడు మూర్ఖుడౌ
రావణుడు
బాహుబలమును జూపి దశకంఠు జంపినా రామపాదాలకూ పాడరే
మంగళము!

శకట రూపము దాల్చి బాలకృష్ణుని కెగ్గు తలపెట్టబోయినా రాక్షసుని పనిపట్టె
కాలు బారుగ జాపి బండినే కూల్చిన చరణకమలాలకూ పాడరే మంగళము!

గోటిబిళ్ళకు వలే తలలెగర తన్నుతూ వత్సకపిత్థులను ఒక్క దెబ్బన గూల్చె
ఆధారభూతుడౌ ఆ జగన్నాథునీ దివ్యపాదాలకూ పాడరే మంగళము!

రాళ్లవానే పడగ గోవర్ధనం బెత్తి యాదవుల కాపాడి పాకారి పొగరణచె
దీనజనవత్సలుని విష్ణుసంభూతునీ అంఘ్రి యుగళమునకూ పాడరే మంగళము!

వేలాయుధా! నీకు వేవేల దండాలు పరమిచ్చి పంపవా ఆశయము తీర్చవా!
తనను నమ్మినవారి కోర్కెలే నెరవేర్చు పారిజాతమునకూ పాడరే మంగళము!

# పాశురం - 25 మూలం

**ఒ**రుత్తి మగనాయ్ పిఱందు ఓరిరవిల్
ఒరుత్తి మగనాయ్ యొళిత్తు వళర
తరిక్కిలానాకి త్తాన్ తీంగు నినైంద
కరుత్తై పిరపిత్తు కంజన్ వైత్తిల్
నెరుప్పెన్న నిన్న నెడుమాలే ఉన్నై
అరుత్తిత్తు వందోం పఱై తరుతియాగిల్
తిరుత్తక్క శెల్వముమ్ శేవకముమ్ యాంపాడి
వరుత్తముమ్ తీరుంద్ మగిరుంద్–ఏలోర్ ఎంబావాయ్.

❖ శంఖచక్రగదాధరుడైన ఆ నారాయణునికే తల్లి కావాలనుకున్న దేవకి కోరిక తీర్చావు. వ్రేపల్లె చేరి యశోదమ్మ బిడ్డవై నీ ఆటపాటలతో మురిపించావు. మరి మా సేవలు స్వీకరించి మా కోరికనూ తీర్చు స్వామీ... అంటున్నట్లుగా గోదాదేవి ఈ పాశురాన్ని పాడుతున్నది.

## తెలుగు గజల్

దేవదేవ నారాయణ వచ్చితివా వల్లభా!
నీ దాసుల పాలింపగ తలచితివా వల్లభా!

నను చేరగ ఇంత శ్రమా?... అని నీవన వినగలమా?
మా ఊపిరి నీవేనని మరచితివా వల్లభా!

తన కడుపున పుట్టమనీ దేవకి వరమడిగిందట
చతుర్భుజుడవై పుట్టీ బ్రోచితివా వల్లభా!

శంఖచక్రగదాధారి పుత్రుడైన పుణ్యమేమి
వ్రేపల్లెకు అంతలోనె తరలితివా వల్లభా!

అర్ధరాత్రి యశోదమ్మ పురిటిపక్క చేరినావు
నోటిలోన విశ్వమంత చూపితివా వల్లభా!

నీ లీలల పాడుతుంటె చలిమంచులు మమ్మంటవు
మా మంగళగీతాలను నచ్చితివా వల్లభా!

కంస మామ కచ్చపట్ట వాని పాలి చిచ్చైతివి
శ్రీకరముగ ఈ భువిపై వెలసితివా వల్లభా!

కృష్ణునిగా అవతరించె విష్ణువనీ గ్రహించాము
మా సేవల ఆనందము పొందితివా వల్లభా!

సంకీర్తన సంతోషం... నివేదనే పరమార్థం
బ్రతుకంతా నీకొరకని గ్రహిస్తివా వల్లభా!

# పాశురం - 26 మూలం

**మా**లే మణివణ్ణా మార్-గరి నీరాడువాన్
మేలైయార్ శేయ్-వనగళ్ వేండువన కేట్టియేల్
లత్తై  యెల్లాం నడుంగ మురల్వన
పాలన్న వణ్ణత్తు ఉన్-పాంచజన్నియమే
పోల్వన శంగంగళ్ పోయ్ ప్పాడుడైయనవే
శాలప్పెరుం పఱైయే పల్లాండిశైప్పారే
కోలవిళక్కే కొడియే వితానమే
ఆలిన్-ఇలైయాయ్ యరుళ్-ఏలోర్ ఎంబావాయ్

❖ ఇంద్రనీలమణి వలె మెరిసిపోతున్న ఆ వటపత్రశాయిని తమ వ్రతానికి కావలసిన వస్తువులు అడుగుతున్న పాశురమిది.

# తెలుగు గజల్

ఇంద్రనీలమణిలాగా మెరిసే వో మాధవా!
శరణు కోరువారి బాధ తీర్చేవో మాధవా!

వటపత్రశాయీ నీకు వల్లకానిదేమున్నది?
ఉదరములో లోకములే దాల్చేవో మాధవా!

నే వలదా? 'పర' చాలా? అనుట నీకు న్యాయమా?
మా మనసే తెలిసి కూడ అడిగేవో మాధవా!

అందాలను పరికించే సమయమిదా శ్రీధరా!
పరికరముల మాకిచ్చి పంపేవో మాధవా!

మా పెద్దలు ధనుర్మాస మహిమ మాకు చెప్పారు
నియమాలను వినగోరిన చెప్పేమో మాధవా!

మార్గశిరం విష్ణుమూర్తి ఒకటేనని అన్నారు
స్నానంతో భగవత్కృప పొందేమో మాధవా!

పాంచజన్య సమానమౌ శంఖాలే కావాలి
స్వచ్ఛమైన శ్వేతశంఖు లిచ్చేవో మాధవా!

మంగళ కీర్తనలు పాడే భాగవతులు ఉండాలీ
దీపాలూ ధ్వజములు సమకూర్చేవో మాధవా!

శక్తిమంతుడవు నీవే భక్త సులభుడవు నీవే
ఛత్రాలూ చామరాలు కోరేమో మాధవా!

మేలుకట్ల నిచ్చి మాకు మేలు చేయి నగధరా!
హృదయములో మాకు చోటు నొసగేవో మాధవా!

# పాశురం - 27 మూలం

**కూ**డార్తై వెల్లుమ్ శీర్ గోవిందా, ఉన్ఱనై
ప్పాడి పఱైకొండు యామ్ పెరుసమ్మానమ్
నాడు పుకరం పరిశినాళ్ నన్టాక
శూడగమే తోళ్ వళైయే తోడే శెవిప్పూవే
పాడగమే యెన్ఱనైయ పల్కలనుమ్ యామణివోమ్
ఆడైయడుప్పోం అతన్ పిన్నే పాల్ శోఱు
మూడనెయ్ పెయ్దు మురంగైవరివార
కూడి ఇరుందు కుళిరుంద్–ఏలోర్ ఎంబావాయ్.

❖ గోపికలు తమ వ్రతాన్ని మెచ్చి అనుగ్రహించమనీ, నేతి పొంగలి నైవేద్యం పెడతామనీ, కృష్ణుడితో కలిసి మోచేతుల దాకా నెయ్యి కారేలా ఆ ప్రసాదం ఆరగిస్తామనీ ఈ పాశురంలో అంటున్నారు.

# తెలుగు గజల్

ఇస్తానంటే ఇంకా ఎన్నో నిన్నడగాలని అనిపిస్తున్నది!
వస్తానంటే నిన్నే మాతో రమ్మందామని అనిపిస్తున్నది!

నీతో కూడని శత్రువు జయించు గుణసంపద గల లక్ష్మీనాథా!
వ్రతమే మెచ్చీ సమ్మానిస్తే ధన్యులమౌతా మనిపిస్తున్నది!

ఎవరికి దొరకని *పరతో వెళితే పొగడ్తలన్నీ మాకే గాదా
మా వేడుకలో ఆభరణాలను అలంకరించా లనిపిస్తున్నది!

రంగుల గాజులు దండకడియాలు పూలకమ్మలు మాకిస్తావా
మేలగు చీరలు సింగారించీ నాట్యం చేయా లనిపిస్తున్నది!

పాలూ నెయ్యీ చక్కెర పోసిన పొంగలి పెడతాం నైవేద్యంగా
మోచేతులకూ కారేటట్లూ నీతో తిందా మనిపిస్తున్నది!

(*పర = తిరుప్పావైలో చాలాసార్లు కనిపించే పదం. యుద్ధాలలో, నృత్యాలలో, ఉత్సవాలలో వాడే భేరీ వంటి మ్రోగించే వాద్యవిశేషం.)

# పాశురం - 28 మూలం

కఱవైగళ్ పిన్ శెన్ఱు కానమ్ శేర్-న్దుణ్-ణ్బోమ్
అఱివొన్ఱు మిల్లాద వాయ్-క్కులత్తు, ఉన్దన్నై
ప్పిఱవి పెఱున్దనై పుణ్ణియమ్ యాముడయోమ్
కుఱైవొన్ఱుమిల్లాద గోవిందా, ఉందన్నో
డుఱవేల్ నమక్కు ఇంగొరిక్క వొరియాదు
అఱియాద పిళ్ళైగళోమ్ అంబినాల్, ఉన్దన్నై
చ్చిఱు పేర్-అళైత్తనవుం శీఱి యరుళాదే
ఇఱైవా! నీ తారాయ్ పఱై ఏలోర్-ఎంబావాయ్.

- పాలు పెరుగు అమ్ముకునే యాదవులమైన మాకు నిన్ను చేరుకోటానికి కృష్ణప్రేమే అర్హత అంటున్నారు గోపికలు.

## తెలుగు గజల్

నియమనిష్ఠలు శుచీశుభ్రతలేవి తెలియని పల్లెవాళ్ళం!
ఆలమందలు మేపుకుంటూ కపట మెరుగని పల్లెవాళ్ళం!

పాలు పెరుగులు అమ్ముకుంటూ పుట్టినందుకు బతుకుతున్నాం
నిన్ను తప్పా అన్యదైవము నెపుడు తలచని పల్లెవాళ్ళం!

యాదవులలో ఒకడి వనగా ధన్యమైనవి జీవితాలే
కృష్ణప్రేమన ఎవరి మాటా లెక్కచేయని పల్లెవాళ్ళం!

నిన్ను కోరగ ఇంతకన్నా పెద్ద అర్హత ఉండవలెనా?
లోపములనే దిద్దగలిగిన నిన్ను వీడని పల్లెవాళ్ళం!

చిన్ననాటీ చెలిమి వల్లా ముద్దుపేరున పిలుస్తుంటాం
అలగకయ్యా చిన్న కృష్ణా! దిక్కుతోచని పల్లెవాళ్ళం!

జ్ఞానసాధన చేయలేదూ ఉపాసించుట నేర్వలేదూ
తెగని బంధం మనది అనుకొని మమత మాయని పల్లెవాళ్ళం!

అనుగ్రహమే కోరి వచ్చాం కోరుకున్నవి ఇవ్వు స్వామీ!
పరను పరమును గాక వేరే వరము లడగని పల్లెవాళ్ళం!

# పాశురం - 29 మూలం

**శి**త్తమ్ శిఱుకాలే వంద్ ఉన్నై చ్చేవిత్తు ఉన్
పొత్తామరై యడియే పోట్రుం పొరుళ్ కేళాయ్
పెత్తమ్మేయ్ త్తుణ్ణుం కులత్తిల్ పిఱందు,
నీకుత్తేవల్ ఎంగలై క్కొళ్ళామల్ పోగాతు
ఇత్తై పఱై కొళ్వాన్ అన్టు కాణ్ గోవిందా!
ఎత్తెక్కుం ఏఱేర్ పిఱవిక్కుం ఉన్ తన్నోడు
ఉత్తమేయావోం ఉనక్కే నామాళ్ చెయ్వోమ్
మత్తై నం కామంగళ్ మాత్త్–ఏలోర్ ఎంబావాయ్.

❖ నీవెంత దయగలవాడివయ్యా గోపాలా! పశువుల కడుపు నింపితేగాని ఏదీ తినవు. ఆ దయ మాపై కూడా చూపించు... అంటున్నారు గోపికలు ఈ పాశురంలో.

# తెలుగు గజల్

గోకులభూషణ! జన్మజన్మలకు నీవే దిక్కని నమ్మితిమయ్యా
భక్తుల మొర విని ఆర్తిని బాపే స్వామివి నీవని నమ్మితిమయ్యా!

వేకువ కన్నా ముందే వచ్చీ వాకిట నిలిచిన గోపకాంతలం
పసిడి వన్నె గల పాదపద్మములు పట్టిన చాలని నమ్మితిమయ్యా!

పశులకు మేతను పెడితేగానీ ఏమీ తిననీ కరుణాసింధూ!
నీ దయ ఒకింత మాపై చూపుట కష్టము కాదని నమ్మితిమయ్యా!

అడిగా మెన్నో... ఇచ్చా వెన్నో... అడగవలసినది వేరే ఉన్నది
భవబంధాలను వదిలింపగలుగువాడవు నీవని నమ్మితిమయ్యా!

నిమిత్తమాత్రులు మానవులంతా నీవు తలచనిది గాలే వీచదు
భోగులు యోగులు అయినారంటే నీ కృపయేనని నమ్మితిమయ్యా!

కైంకర్యంతో మా కథ ముగిసే వరమే ఒసగుము పంకజనాభా!
పుట్టుకలెన్నో రాసి పెట్టినా చేయి వదలవని నమ్మితిమయ్యా!

# పాశురం - 30 మూలం

**వం**గ క్కడల్ కడైంద మాదవనై క్కేశవనై
తింగళ్ తిరుమగత్తు శేయిరైయార్ శెన్జిఱైంజి
అంగ ప్పఱై కొండవాత్తై అణి పుదువై
ప్పైంగమల త్తణ్ తెరియల్ పట్టర్బిరాన్ కోదై శొన్న
శంగ త్తమిర్ మాలై ముప్పదుం తప్పామే
ఇంగిప్పరిశురైప్పర్ ఈరిరండు మాల్ వరైత్తోళ్
శెంగణ్ తిరుముగత్తు చ్చెల్వ త్తిరుమాలాల్
ఎంగుం తిరువగుళ్ పెత్తిన్బుఱువర్ ఎంబావాయ్.

❖ గోదాదేవి తనను, తన స్నేహితురాండ్రను గోపికలుగా భావించుకొన్నది. ధనుర్మాసంలో ఆండాళ్ తల్లి పాడిన తిరుప్పావై పాడిన వారికి ద్విభుజుడైన శ్రీకృష్ణుడు చతుర్భుజుడైన శ్రీమన్నారాయణుడై పురుషార్థములను ప్రసాదిస్తాడని చెప్పిన ఫలశృతి పాశురానికి గజల్ పాట.

## తెలుగు గజల్

ఆనందం గుండె నిండ నింపినదే తిరుప్పావు!
హరి లీలలు పాటలుగా కట్టినదే తిరుప్పావు!

తులసీవన ప్రసాదమై భట్టారకు నింట పెరిగి
విష్ణుచిత్త సుత కోదై పాడినదే తిరుప్పావు!

నారాయణు ప్రేమలోన ఇహలోకం మరిచిపోయె
నారీమణి కృష్ణభక్తి చాటినదే తిరుప్పావు!

కేశవుడే మాధవుడై క్షీరాబ్ధికి అల్లుడాయె
విష్ణుగాథనాలపిస్తు రాసినదే తిరుప్పావు!

మూడు పదులు పాశురాలు ముక్తిసౌధ సోపానం
ఆండాళ్ళును శ్రీరంగని కలిపినదే తిరుప్పావు!

ఒక్క పూవు లోపిస్తే పూలమాల బాగుండదు
ఒక్క పాట తగ్గకుండకూర్చినదే తిరుప్పావు!

గ్రంథమహిమ చాటి చెప్పె తమిళదేశ శంఖఫలక
భక్తాళికి  మోక్షమీయగలిగినదే తిరుప్పావు!

పరమాత్ముని సన్నిధికిది తిరుగులేని భక్తి బాట!
నల్లనయ్య ఉల్లము రంజిల్లునదే తిరుప్పావు!

మెట్టు మెట్టు ఎక్కినట్లు పాటమీద పాట పాడ
తరియింపగ సూక్తిసుధను పంచినదే తిరుప్పావు!

రంగమందు అప్పిన్నది పెళ్ళాడిన రోజు భోగి
రంగనికే ఇల్లాలిని చేసినదే తిరుప్పావు!

❖ ❖ ❖

లక్ష్మీచరణ లాక్షాంక సాక్షి శ్రీవత్సవక్షసే!
క్షేమం కరాయ సర్వేషాం శ్రీరంగేశాయ మంగళమ్!

స్వోచ్ఛిష్ట మాలికా బంధ గంధబంధుర జిష్ణవే!
విష్ణుచిత్త తనూజాయై గోదాయై నిత్యమంగళమ్!

సంపూర్ణం – శుభం భూయాత్

❖ ❖ ❖

| పాశురం | మొదటి పదాలు | రాగం | తాళం |
|---|---|---|---|
| 0 | ప్రార్థన – గానామృత సుధలు పంచు | నాట / శుద్ధధన్యాసి | త్రిశ్రగతి ఆది |
| 1 | మంచిమాసము మార్గశీర్షము | పట్ దీప్ | మిశ్రచాపు |
| 2 | సుఖాలెన్నో అనుభవించాం | బిళహరి | మిశ్రచాపు |
| 3 | దీక్షపట్టి హరిచరితము | హిందోళ | త్రిశ్రగతి ఆది |
| 4 | నారాయణా కరుణ చూపుమా వేగమే | మియామల్హార్ | ఖండచాపు |
| 5 | కృష్ణలీలలు మధురమైనవి | కీరవాణి | మిశ్రచాపు |
| 6 | కాకుల అరుపులు కోవెల గంటలు | మలయ మారుతం | ఆది |
| 7 | చెట్లమీద పక్షులన్ని మేతలకై సిద్ధమాయె | సారంగ | త్రిశ్రగతి ఆది |
| 8 | తూర్పు మనకు మార్గదర్శి తామసాన్ని వదలవే | వాసంతి | త్రిశ్రగతి ఆది |
| 9 | అగరుధూపం మత్తులోనే మితము మరిచీ నిద్రపోకే | ద్విజావంతి | మిశ్రచాపు |
| 10 | తలుపుతీయ వద్దులేవె అందమైన ప్రియసఖీ | తిలంగ్ | త్రిశ్రగతి ఆది |

| | | | |
|---|---|---|---|
| 11 | పోట్ల ఆవుల పాలు పితికే<br>కిటుకు తెలిసిన గోపకాంతవు | అమృతవర్షిణి | మిశ్రచాపు |
| 12 | అన్నకేమో ఆ అనంతుని<br>సేవలోనే గడిచె కాలం! | వలజి | మిశ్రచాపు |
| 13 | చిగుళ్ళవలె దశకంఠుని<br>శిరసులనే కోసినాడు | శుద్ధధన్యాసి | త్రిశ్రగతి<br>ఆది |
| 14 | చెప్పిన మాటలు తప్పెదవేమే<br>...ఏమన్నావో గుర్తుచేసుకో | అభోగి | ఆది |
| 15 | లేత చిలుకా వంటి లేమా!<br>తలుపు తీయవె సుందరాంగీ! | ఆనందభైరవి | మిశ్రచాపు |
| 16 | భువనపాలకు భవనపాలక | మోహన | మిశ్రచాపు |
| 17 | శ్రీనందగోపాల<br>శ్రితపారిజాతమా మేలుకో | మలహరి | ఖండచాపు |
| 18 | గజబలుడు భుజబలుడు నందునీ<br>కోడలివి రావమ్మ నీళమ్మ | చంద్రకౌంస్ | ఖండచాపు |
| 19 | నీలాదేవీ కృష్ణుడు నీతో<br>లోపల కలడని | కల్యాణి | ఆది |
| 20 | ముక్కోటి దేవతల ఇడుములను<br>తొలగించు నా స్వామి మేలుకో | చారుకేశి | మిశ్రచాపు |
| 21 | గోసంపదున్నట్టి నందునీ<br>గృహమందు జన్మించినావయ్య<br>కృష్ణా | అడానా/<br>జౌన్పురి | మిశ్రచాపు |

| | | | |
|---|---|---|---|
| 22 | చిరుగంటల పోలిన నీ అరవిచ్చిన నయనాలను | మాయా మాళవగౌళ | త్రిశ్రగతి ఆది |
| 23 | లోకాలను పాలించే పెరుమాళ్ళుకు స్వాగతం | హంసధ్వని | త్రిశ్రగతి ఆది |
| 24 | పూరేకలను బోలి సుకుమార మైనట్టి దివ్యపాదాలకూ పాడరే మంగళము | మధ్యమావతి | ఖండచాపు |
| 25 | దేవదేవ నారాయణ వచ్చితివా వల్లభా! | హంసానంది | త్రిశ్రగతి ఆది |
| 26 | ఇంద్రనీల మణిలాగా మెరిసే వో మాధవా | శివరంజని | త్రిశ్రగతి ఆది |
| 27 | ఇస్తానంటే ఇంకా ఎన్నో నిన్నడగాలని అనిపిస్తున్నది | కాపి | ఆది |
| 28 | నియమనిష్ఠలు శుచీశుభ్రతలేవి తెలియని పల్లెవాళ్ళం | ముఖారి | ఆది |
| 29 | గోకుల భూషణ! జన్మజన్మలకు నీవే దిక్కని నమ్మితిమయ్యా | ఖరహరప్రియ | ఆది |
| 30 | ఆనందం గుండెనిండ నింపినదే తిరుప్పావు | శ్రీ రాగం | ఆది |



# శ్రీ రంగనాథస్వామి అష్టోత్తర శతనామావళి

ఓం శ్రీరంగశాయినే నమః
ఓం శ్రీకాంతాయ నమః
ఓం శ్రీప్రదాయ నమః
ఓం శ్రితవత్సలాయ నమః
ఓం అనంతాయ నమః
ఓం మాధవాయ నమః
ఓం జేత్రే నమః
ఓం జగన్నాథాయ నమః
ఓం జగద్గురవే నమః
ఓం సురవర్యాయ నమః
ఓం సురారాధ్యాయ నమః
ఓం సురరాజానుజాయ నమః
ఓం ప్రభవే నమః
ఓం హరయే నమః
ఓం హతారయే నమః
ఓం విశ్వేశాయ నమః
ఓం శాశ్వతాయ నమః
ఓం శంభవే నమః
ఓం అవ్యయాయ నమః
ఓం భక్తార్తిభంజనాయ నమః
ఓం వాగ్మినే నమః
ఓం వీరాయ నమః
ఓం విఖ్యాతకీర్తిమతే నమః
ఓం భాస్కరాయ నమః
ఓం శాస్త్రతత్త్వజ్ఞాయ నమః
ఓం దైత్యశాస్త్రే నమః
ఓం అమరేశ్వరాయ నమః
ఓం నారాయణాయ నమః

ఓం నరహరయే నమః
ఓం నీరజాక్షాయ నమః
ఓం నరప్రియాయ నమః
ఓం బ్రహ్మణ్యాయ నమః
ఓం బ్రహ్మకృతే నమః
ఓం బ్రహ్మణ్యై నమః
ఓం బ్రహ్మాంగాయ నమః
ఓం బ్రహ్మ పూజితాయ నమః
ఓం కృష్ణాయ నమః
ఓం కృతజ్ఞాయ నమః
ఓం గోవిందాయ నమః
ఓం హృషీకేశాయ నమః
ఓం అఘనాశనాయ నమః
ఓం విష్ణవే నమః
ఓం జిష్ణవే నమః
ఓం జితారాతయే నమః
ఓం సజ్జనప్రియాయ నమః
ఓం ఈశ్వరాయ నమః
ఓం త్రివిక్రమాయ నమః
ఓం త్రిలోకేశాయ నమః
ఓం త్రయ్యర్థాయ నమః
ఓం త్రిగుణాత్మకాయ నమః
ఓం కాకుత్స్థాయ నమః
ఓం కమలాకాంతాయ నమః
ఓం కాళియోరగమర్దనాయ నమః
ఓం కాలాంబుదశ్యామలాంగాయ నమః
ఓం కేశవాయ నమః
ఓం క్లేశనాశనాయ నమః
ఓం కేశిప్రభంజనాయ నమః
ఓం కాంతాయ నమః
ఓం నందసూనవే నమః
ఓం అరిందమాయ నమః
ఓం రుక్మిణీవల్లభాయ నమః
ఓం శౌరయే నమః
ఓం బలభద్రాయ నమః
ఓం బలానుజాయ నమః
ఓం దామోదరాయ నమః
ఓం హృషీకేశాయ నమః
ఓం వామనాయ నమః
ఓం మధుసూదనాయ నమః
ఓం పూతాయ నమః
ఓం పుణ్యజనధ్వంసినే నమః
ఓం పుణ్యశ్లోకశిఖామణయే నమః
ఓం ఆదిమూర్తయే నమః
ఓం దయామూర్తయే నమః
ఓం శాంతమూర్తయే నమః
ఓం అమూర్తిమతే నమః
ఓం బ్రహ్మణే నమః
ఓం పరస్మైధామ్నే నమః
ఓం పావనాయ నమః

ఓం పవనాయ నమః
ఓం విభవే నమః
ఓం చంద్రాయ నమః
ఓం ఛందోమయాయ నమః
ఓం రామాయ నమః
ఓం సంసారాంబుధితారకాయ నమః
ఓం ఆదితేయాయ నమః
ఓం అచ్యుతాయ నమః
ఓం భానవే నమః
ఓం శంకరాయ నమః
ఓం శివాయ నమః
ఓం ఊర్జితాయ నమః
ఓం మహేశ్వరాయ నమః
ఓం మహాయోగినే నమః
ఓం మహాశక్తయే నమః
ఓం మహత్ప్రియాయ నమః
ఓం దుర్జనధ్వంసకాయ నమః
ఓం అశేషసజ్జనోపాస్తిసత్ఫలాయ నమః
ఓం పక్షీంద్రవాహనాయ నమః
ఓం అక్షోభ్యాయ నమః
ఓం క్షీరాబ్ధిశయనాయ నమః
ఓం విధవే నమః
ఓం జనార్ధనాయ నమః
ఓం ఓం జగద్ధితాయనమః
ఓం చక్రపాణయే నమః
ఓం శంఖధారిణే నమః
ఓం శార్ఙ్గిణే నమః
ఓం ఖడ్గినే నమః
ఓం గదాధరాయ నమః

**ఇతి శ్రీ రంగనాథ అష్టోత్తర శతనామావళి సంపూర్ణం**

❖ ❖ ❖



# శ్రీ గోదాదేవి అష్టోత్తర శతనామావళి

ఓం శ్రీరంగనాయక్యై నమః
ఓం గోదాయై నమః
ఓం విష్ణుచిత్తాత్మజాయై నమః
ఓం సత్యై నమః
ఓం గోపీవేషధరాయై నమః
ఓం దేవ్యై నమః
ఓం భూసుతాయై నమః
ఓం భోగశాలిన్యై నమః
ఓం తులసీకాననోద్భుతాయై నమః

ఓం శ్రీయై నమః
ఓం ధన్విపురవాసిన్యై నమః
ఓం భట్టనాథ ప్రియకర్త్యై నమః
ఓం శ్రీకృష్ణ హితభోగిన్యై నమః
ఓం ఆముక్తమాల్యదాయైనమః
ఓం బాలాయై నమః
ఓం రంగనాథ ప్రియాయై నమః
ఓం పరాయై నమః
ఓం విశ్వంభరాయై నమః

ఓం కలాలాపాయై నమః
ఓం యతిరాజసహోదర్యై నమః
ఓం కృష్ణానురక్తాయై నమః
ఓం సుభగాయై నమః
ఓం సులభశ్రియై నమః
ఓం సలక్షణాయై నమః
ఓం లక్ష్మీప్రియసఖ్యై నమః
ఓం శ్యామాయై నమః
ఓం దయాంచిత దృగంచలాయై నమః
ఓం ఫల్గున్యావిర్భవాయై నమః
ఓం రమ్యాయై నమః
ఓం ధనుర్మాసకృత వ్రతాయై నమః
ఓం చంపకాశోకపున్నాగమాలతీ విలసత్కచాయై నమః
ఓం ఆకారత్రయసంపన్నాయై నమః
ఓం నారాయణసమాశ్రితాయై నమః
ఓం శ్రీమదష్టాక్షరీమంత్రరాజస్థిత మనోరథాయై నమః
ఓం మోక్షప్రదాననిపుణాయై నమః
ఓం మంత్రరత్నాధిదేవతాయై నమః
ఓం బ్రహ్మణ్యాయై నమః
ఓం లోకజనన్యై నమః
ఓం లీలామానుషరూపిణ్యై నమః
ఓం బ్రహ్మజ్ఞాయై నమః
ఓం అనుగ్రహాయై నమః

ఓం మాయాయై నమః
ఓం సచ్చిదానందవిగ్రహాయై నమః
ఓం మహాపతివ్రతాయై నమః
ఓం విష్ణుగుణకీర్తనలోలుపాయై నమః
ఓం ప్రపన్నార్తిహరాయై నమః
ఓం నిత్యాయై నమః
ఓం వేదసౌధవిహారిణ్యై నమః
ఓం శ్రీరంగనాధమాణిక్యమంజర్యై నమః
ఓం మంజుభాషిణ్యై నమః
ఓం సుగంధార్థ గ్రంథకర్త్యై నమః
ఓం రంగమంగళ దీపికాయై నమః
ఓం ధ్వజవజ్రాంకుశాబ్జాంకమృదు పాదతలాంచితాయై నమః
ఓం తారకాకారనఖరాయై నమః
ఓం ప్రవాళమృదులాంగుళ్యై నమః
ఓం కూర్మోపమేయపాదోర్ధ్వభాగాయై నమః
ఓం శోభనపార్ష్ణికాయై నమః
ఓం వేదార్థభావవిదిత తత్వబోధాంఘ్రి పంకజాయై నమః
ఓం ఆనందబుద్బుదాకార సుగుల్ఫాయై నమః
ఓం పరమాయై నమః
ఓం అణుకాయై నమః

ఓం తేజశ్శ్రియోజ్జ్వలధృతపాదాంగుళి సుభూషితాయై నమః
ఓం మీన కేతనతూణీర చారుజంఘా విరాజితాయై నమః
ఓం కకుద్వజ్జానుయుగ్మాఢ్యాయై నమః
ఓం స్వర్ణ రంభాభ సక్థికాయై నమః
ఓం విశాలజఘనాయై నమః
ఓం పీనసుశ్రోణ్యై నమః
ఓం మణిమేఖలాయై నమః
ఓం ఆనందసాగరావర్త గంభీరాంభోజ నాభికాయై నమః
ఓం భాస్వద్వళిత్రికాయై నమః
ఓం చారుజగత్పూర్ణమహోదర్యై నమః
ఓం నవమల్లీరోమరాజ్యై నమః
ఓం సుధాకుంభాయితస్తన్యై నమః
ఓం కల్పమాలానిభభుజాయై నమః
ఓం చంద్రఖండనఖాంచితాయై నమః
ఓం సుప్రవాళాహ్నాంగులి న్యస్త మహా రత్నాంగులీయకాయై నమః
ఓం నవారుణ ప్రవాళాభపాణిదేశ సమంచితాయై నమః
ఓం కంబుకంఠ్యై నమః
ఓం సుచుబుకాయై నమః
ఓం బింబోష్ఠ్యై నమః
ఓం కుందదంతయుజే నమః
ఓం కారుణ్యరసనిష్యంది నేత్రద్వయ సుశోభితాయై నమః
ఓం ముక్తాశుచిస్మితాయై నమః
ఓం చారుచాంపేయనిభనాసికాయై నమః
ఓం దర్పణాకార విపుల కపోల ద్వితయాంచితాయై నమః
ఓం అనంతార్క ప్రకాశోద్యన్మణి తాటంక శోభితాయై నమః
ఓం కోటి సూర్యాగ్ని సంకాశ నానా భూషణ భూషితాయై నమః
ఓం సుగంధ వదనాయై నమః
ఓం సుభ్రువే నమః
ఓం అర్ధచంద్రలలాటికాయై నమః
ఓం పూర్ణచంద్రాననాయై నమః
ఓం నీలకుటిలాలక శోభితాయై నమః
ఓం సౌందర్యసీమాయై నమః
ఓం విలసత్కస్తూరీ తిలకోజ్జ్వలాయై నమః
ఓం ధగద్ధగాయమానోద్యన్మణిసీమంత భూషణాయై నమః
ఓం జాజ్వల్య మానాయైనమః
ఓం సద్రత్న దివ్యచూడావతంసకాయై నమః

ఓం సూర్యార్థచంద్రవిలసద్భూష
ణాంచిత వేణికాయై నమః
ఓం అత్యర్కానలతేజోధిమణికంచుక
ధారిణ్యై నమః
ఓం నిగన్నిగద్రత్నపుంజ ప్రాంతస్వర్ణ
నిచోళికాయై నమః
ఓం సద్రత్నాంచితవిద్యోతవిద్యు
త్కుంజాభ శాటికాయై నమః
ఓం నానామణిగణాకీర్ణ హేమాంగద
సుభూషితాయై నమః
ఓం కుంకుమాగరు కస్తూరీ దివ్య
చందన చర్చితాయై నమః
ఓం స్వోచితౌజ్జ్వల్య వివిధ విచిత్ర మణి
హారిణ్యై నమః
ఓం అసంఖ్యేయసుఖస్పర్శ సర్వాతిశయ
భూషణాయై నమః

ఓం మల్లికాపారిజాతాది దివ్యపుష్ప
స్రగంచితాయై నమః
ఓం శ్రీరంగనిలయాయై నమః
ఓం పూజ్యాయై నమః
ఓం దివ్యదేశ సుశోభితాయై నమః
ఓం శ్రీరంగనాయక్యై నమః
ఓం శ్రీమహాలక్ష్మై నమః
ఓం శ్రీభూదేవ్యై నమః
ఓం శ్రీనీళాదేవ్యై నమః
ఓం శ్రీగోదాదేవ్యై నమః
ఓం శ్రీఅనంతాయ నమః
ఓం శ్రీగరుడాయ నమః
ఓం శ్రీమతే విష్వక్సేనాయ నమః
ఓం శ్రీపరాంకుశాయ నమః
ఓం శ్రీమతే రామానుజాయ నమః
ఓం శ్రీమద్వరవరమునయే నమః

ఓం స్వాచార్యేభ్యో నమః
ఓం పూర్వాచార్యేభ్యో నమః
ఓం సమస్తపరివార సర్వదివ్యమంగళ విగ్రహాయ
శ్రీమతే నారాయణాయ నమః

❖ ❖ ❖



## నా గురించి....

**అధికారిక నామం :** డా . బి. ఉమాదేవి, MA B.Ed . Ph. D

**వ్యావహారిక నామం :** డా. ఉమాదేవి జంధ్యాల

రీడర్, తెలుగుశాఖ. జవహర్ భారతి డిగ్రీ కళాశాల (1973 - 2006)

## తెలుగులో కృషి .....

ఆధునిక ఆంధ్రకవిత్వము - స్త్రీ (పరిశోధన).
100 కు పైగా పుస్తక సమీక్షలు.
పత్రికలలో కవితలు, ఫీచర్స్, పద్యములు.
వివిధ ముఖపుస్తక కూటములలో 300 పైగా గజళ్ళు.
వివిధ వేదికలపై సాహిత్య ప్రసంగాలు.
ఆకాశవాణిలో సాహిత్య ప్రసంగాలు.
ఇప్పుడు తిరుప్పావై తెలుగు గజళ్ళు పుస్తకము.

JV

ధర: అమూల్యం